# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త




### అధికారులు...

## ప్రజల సమస్యలను పరిష్కరించాలి

**ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**

గూడూరు, నవంబర్ 21 ప్రభాతవార్త : ప్రజల సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని, ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఆన్లైన్ ద్వారా సీఎం డాష్ బోర్డుకు పంపిస్తున్నామని సంబంధిత అధికారుల సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అధికారులను ఆదేశించారు. గూడూరు పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించారు పలు గ్రామాల నుండి ప్రజలు వచ్చి ఎమ్మెల్యేకి తమ సమస్యలు తెలియజేశారు కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు అర్జీలు పరితగతిన పరిష్కారం అయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని తిరుపతి జిల్లాలో మొదట గూడూరులోనే ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల ఇచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడాలని రెవెన్యూ శాఖలో ఎక్కువ సమస్యలు వస్తున్నాయని ప్రజల ఇచ్చిన అర్జీలను ఆన్లైన్ ద్వారా సీఎం డాష్ బోర్డుకు పంపించడం జరుగుతుందని వెల్లడించారు. ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమణలు గురి చేస్తున్నారని అధికారులు ఇటువంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ప్రసాద్, ఎంపీడీవో, మధుసూదన్ రావు, కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు కిరణ్ కుమార్, భాస్కర్‌రెడ్డి, డిఎల్‌డివో వాణిరెడ్డి, మట్టం శ్రావణిరెడ్డి, వెంకటేశ్వరరాజు, బిల్లు చెంచురామయ్య, రహీం, టిడిపి అనుబంధ సంఘ సభ్యులు, పలు శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## కరువు రహిత రాష్ట్రమే సిఎం లక్ష్యం

**- ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మహిళల ఆర్థిక ప్రగతికి తోడ్పాటు**
**- సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి**





నడింపల్లిలో మహిళలనుద్దేశించి ప్రసంగిస్తున్న భువనేశ్వరి

శాంతిపురం, నవంబర్ 21 ప్రభాతవార్త : రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా చేయడమే సిఎం చంద్రబాబునాయుడు లక్ష్యం అని సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కుప్పం పర్యటనలో భాగంగా శుక్రవారం నారా భువనేశ్వరి మండలంలోని నడింపల్లి గ్రామంలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని సిఎం చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేశారన్నారు. కుప్పానికి ఇదివరకే ఏడు పరిశ్రమలు రాగా త్వరలో మరో ఎనిమిది పరిశ్రమలు వస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకప్రజలకుస్వేచ్ఛ లభించిందన్నారు. మహిళల రక్షణకు ప్రత్యేకచర్యలు చేపట్టారన్నారు. సిఎం చంద్రబాబు కృష్ణాజలాలతో కుప్పం ప్రజలు,రైతుల కలని సాకారం చేశారన్నారు. మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలని సూచించారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఆశయ ంతో సిఎం చంద్రబాబు డ్వాక్రా సంఘాలు స్థాపించారన్నారు. నేడు డ్వాక్రా సంఘాల మహిళలు వేలకోట్ల రూపాయలు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది సకాలంలో చెల్లిస్తూ పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారన్నారు. ఎదురుదెబ్బలు తగిలినా వాటినుంచి నేర్చుకుని ముందుకు సాగాలన్నారు. కుప్పంలో మహిళల ప్రతిభ వెలికి తీసి వారికి శిక్షణ ఇస్తూ పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తున్న ఎలీప్ సంస్థ రమాదేవి బృందం కృషి అభినందనీయమన్నారు.

**ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మహిళలకు తోడ్పాటు :**

కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మహిళల ఆర్థిక ప్రగతికి తోడ్పాటునందిస్తున్నట్లు నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఉచితంగా కుట్టుశిక్షణ, మగ్గం, చికెన్ కారీ వర్క్‌లో శిక్షణ ఇప్పించడంతో పాటు మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు సైతం అందిస్తున్నట్లు తెలిపారు. అ ంతకుముందు తుమ్మిశి పెద్ద చెరువు వద్ద జలహారతి కార్యక్రమంలో నారా భువనమ్మ పాల్గొని కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. శాంతిపురం నుంచి తుమ్మిశివరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఆర్టీసీ బస్సు ఎక్కిన అనంతరం కండక్టర్ ఆధార్ తప్పనిసరి అని చెప్పడంతో కండక్టర్ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తోందని నారా భువనమ్మ కండక్టర్‌ను అభినందించారు. అంతకుముందు తుమ్మిశి పెద్దచెరువులో జలహారతి కార్యక్రమం చేపట్టారు. అనంతరం గడ్డూరులో మొక్కలు నాటారు. శాంతిపురంలో లక్ష్మీవైభవ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్‌సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ నాయుడు, ఎపి కార్మిక సంక్షేమ బోర్డు సభ్యుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి,ఎల్.జయరాంరెడ్డి,గోపాల్, చంద్ర, రమేష్, బాలకృష్ణ, ఆంజనేయరెడ్డి, గోవిందరాజులు, నాగరాజు, శివ, చంద్రకళ,అనసూయ, సుగుణమ్మ పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మి కాసులహారం శోభాయాత్ర

**- గజ, గరుడ వాహనాల్లో అమ్మవారికి అలంకరణ- ఉత్సవంలో టీటీడీ ఈవో**





తిరుచానూరు, నవంబర్ 21 ప్రభాత =వార్త : తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్సవాలలో శుక్రవారం గజవాహన సందర్భంగా తిరుమల శ్రీవారి లక్ష్మి కాసుల హారం శోభాయాత్ర తిరుచానూరులో వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా తిరుమల శ్రీవారి ఆలయం నుండి అదనపు ఈవో వెంకయ్య చౌదరి లక్ష్మి కాసులహారాన్ని తిరుచానూరు లోని శిల్పారామం -పసుపు మండపం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన మంగళ వాయిద్యాలు నడుమ శోభాయాత్రగా మాడ వీధుల గుండా ఆలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో మాట్లాడుతూ శ్రీవారి ఆభరణాలలో లక్ష్మి కాసులహారం అత్యంత ప్రధానమైందని, పౌర్ణమి గరుడసేవ సందర్భంగా ఈ హారాన్ని శ్రీ మలయప్పస్వామి వారికి అలంకరిస్తామని తెలిపారు. సాక్షాత్తు స్వామివారు ధరించే ఈ హారాన్ని గజవాహనం, గరుడవాహన సేవల సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జేఈఓ వి.వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఎంత కష్టమొచ్చింది తల్లీ...!

**-నెలల బిడ్డతో సహా తల్లి ఆత్మహత్య**
**-శోకసంద్రంలో పుట్టినిళ్ళు మెట్టినిళ్ళు**



చెక్‌డ్యాంలో పడి మృతి చెందిన తల్లీబిడ్డ



చౌడేపల్లి, నవంబర్ 21 ప్రభాతవార్త : తెల్లవారంగట్రా ఊరంతా కమ్ముకున్న పొగమంచు...అందరూ ఎవరి పనుల్లో వారు నిమగ్నమైన వేళ...ఉన్నట్టుండి వామ్మో చెక్‌డ్యాంలో శవాలంటూ అరుపులు...ప్రశాంతంగా వున్న గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది... తీరా వెళ్ళి చూస్తే విగతజీవులుగా వున్న తల్లీబిడ్డలు... అందరికీ కళ్ళనీరు తెప్పించే సంఘటనా వివరాలు మృతురాలి తండ్రి కథనం మేరకు...మండలంలోని పంచాయతీ కేంద్రం వెంగళపల్లికి చెందిన నరసింహులు కుమార్తె ఆదిలక్ష్మి(25), కాగతి పంచాయతీ ఎగువ గాజులవారిపల్లి గంగాధర్‌తో మూడేళ్ళ క్రితం వివాహమైంది. ప్రస్తుతం ఆదిలక్ష్మి సోమల మండలం ఆవులపల్లి సచివాలయంలో ఎంఎల్‌పిహెచ్‌ఇఓ ప్రభుత్వ ఉద్యోగం చేస్తోంది. ఆమె భర్త గంగాధరం మదనపల్లి ఏరియా ఆసుపత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా ఒప్పంది కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఆదిలక్ష్మి గర్భం దాల్చడంతో పుట్టింటికి వచ్చింది. ఇక్కడ పదినెలల క్రితం పండంటి ఆడశిశువుకు జన్మనిచ్చింది. అయితే క్రితక పుట్టినప్పటి నుంచి నరాల బలహీనతగా గుర్తించిన తల్లి పెద్దపెద్ద నగరాల్లో మెరుగైన వైద్యాన్నందించింది. అనిప్పటికీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో గత వారం రోజులుగా కలతగా వుంటూ నిరుత్సాహ వుండేదని తండ్రి నరసింహులు తెలిపాడు. ఇదిలా వుండగా శుక్రవారం తెల్లవారు జామున 5గంటలకు ఆదిలక్ష్మి ఆమె శిశువు కనిపించకుండా పోయిన విషయాన్ని గుర్తించాడు. వెంటనే సమీపంలోని అల్లుడి వద్దకు వెళ్ళగా అక్కడా కనిపించకపోవడంతో గ్రామానికి తిరిగి వచ్చేశాడు. పల్లెకు కూతవేటు దూరంలోని చెక్‌డ్యాం వద్ద ఆదిలక్ష్మి విడచిన చెప్పులు, టార్చిలైట్‌ను గుర్తించిన గ్రామస్తులు అందులో వెతుకగా చిన్నారి క్రితిక, తల్లి ఇరువురూ మృతి చెంది కనిపించారు. విషయాన్ని తెలుసుకొన్న ఎస్ఐ నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. మృతురాలు తండ్రి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతులను శవపరీక్ష నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఆదిలక్ష్మి చెక్‌డ్యాంలోకి ప్రమాదశాత్తు పడిందా...ఆత్మహత్యకు పాల్పడిందా...అన్న విషయాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి వుంది.

## పార్కింగ్ ఫీజుపై శ్రద్ధ... సదుపాయాలపై లేదా!

**పార్కింగ్ ఫీజులు ఘనం-సదుపాయాలు శూన్యం**



అవస్థలు పడుతున్న అయ్యప్ప భక్తులు

శ్రీకాళహస్తి,నవంబర్ 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి దేవస్థానం పార్కింగ్ ఫీజులను కోట్లు వసూలు చేసుకుంటున్నారు.కానీ వారి పర్యవేక్షణలోని టూరిస్టుబస్టాండులో సమస్యలు కాపురం చేస్తుంటే పట్టించుకోవటం లేదని యాత్రికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇక్కడకు వచ్చిన దూర ప్రాంతాలకు చెందిన అయ్యప్పల తిప్పలు వర్ణణాతీతంగా మారాయి. శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రతి రోజూ కనీసం వంద టూరిస్టు బస్సులు వస్తుంటాయి. వారి పార్కింగ్ కోసం సమీపంలో 'దేవస్థానం టూరిస్టు బస్టాండు' ఏర్పాటు చేసారు. ఇక్కడ వచ్చిన యాత్రికులకు కనీస సదుపాయాల్లేదు. మరుగుదొడ్లు ఉన్నాయి, కానీ అక్కడ పరిశుభ్రత లేదు. ఎవరైనా పొరబాటున అక్కడకు వెళితే ముక్కు మూసుకొని రావాల్సిందే. ఇక్కడ యాత్రికులు వంట చేసుకోవటానికిఎలాంటి సదుపాయం లేదు. ఇక దేవస్థానం కోట్లు వెచ్చించి కొండచుట్టూ సిమెంటు రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు.కానీ దేవస్థానంకు కూత వేటు దూరంలోనిటూరిస్టుబస్టాండులో వర్షపు చినుకు పడితేచెరువుల్లా మారుతుంది. కార్తీక మాసం అయ్యప్ప దర్శనానికి శబరిమలై వెళ్ళి తిరిగి వచ్చే భక్తులు స్వామి దర్శనానికి వెళ్ళగా అక్కడ వంటలు చేసుకొనుటకు పడుతున్న తిప్పలు వర్ణనాతీతంగా మారాయి.ఎటు చేసినా వర్షం నీరు నిల్వ ఉండటంతో ఎక్కడ వంట చేసుకోవాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యాత్రికుల సౌకర్యార్థం కనీసం షెడ్డులు ఏర్పాటు చేసినా బాగుండేదని యాత్రికులు అభిప్రాయపడుతున్నారు.శ్రీకాళహస్తీశ్వరాలయం ఏటా పార్కింగ్ ఫీజు రూ.1.5కోట్లు కాంట్రాక్టర్ నుంచి వసూలు చేసుకుంటున్నారు. కానీ వాహనాల పార్కింగ్‌కు సరైన మైదానం లేదు.వచ్చిన వాహనాల యజమానుల నుంచి కాంట్రాక్టర్ నిర్ణీత సొమ్ము వసూలు చేసుకొని ప్రవేశింపజేస్తారు.వారు ఇక్కడకు వచ్చిన తరువాత ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ పార్కింగ్ చేసుకోవాలి. వాహనాలు అధికమైతే స్వర్ణముఖి నదే దిక్కు. ఇక టూరిస్టు బస్సులు సరాసరి నాల్గవ గేటు వద్ద యాత్రికులను వదలిపెట్టి బస్టాండు ఆవరణలోకి వెళ్ళాలి. అక్కడ కనీస సదుపాయాల్లేక తల్లడిల్లుతున్నారు.

## గజవాహనంపై అనుగ్రహించిన శ్రీమహాలక్ష్మి

**-పల్లకిపై మోహిని అలంకారంలో పద్మావతి దేవి-గజ వాహనంతో జనసంద్రంగా మారిన మాడవీధులు**



తిరుచానూరు, నవంబర్ 21 ప్రభాతవార్త తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన గజ వాహన సేవలో అశేష భక్తజనుల నడుమ గజవాహనంపై శ్రీ మహాలక్ష్మి కటాక్షించారు. ఇందులో భాగంగా ఉదయం పల్లకిపై మోహిని అవతారంలో పద్మావతి దేవి భక్తులను అనుగ్రహించారు. అమ్మవారి ఉత్సవర్లను వాహన మండపంకు వేంచేపుచేసి మోహినీ అలంకారంలో పల్లకి వాహనంపై కొలువు దీర్చారు. అనంతరం తిరుమాడ వీధులలో భజనలు కోలాటాల నడుమ తేజోమయి భక్తులను అనుగ్రహించారు. మధ్యాహ్నం ఆలయ ముఖమండపం వద్ద స్నపన తిరుమంజనం కన్నుల పండుగగా నిర్వహించారు. తర్వాత వాహనం మండపంకు అమ్మవారి ఉత్సవర్లను వేంచేపు చేసి వివిధ రకాల పుష్పాలు వజ్ర వైడూర్య మణి మాణిక్యాలతో స్వర్ణలంకార శోభితురాలు అయినా పద్మావతి దేవిని లక్ష్మి దేవి అలంకారంలో అమ్మవారికి మిక్కిలి ప్రీతిపాత్రమైన గజ వాహనంపై కొలువుతీర్చారు. అనంతరం భజనలు, కోలాటాలు నడుమ మహా కీర్తి ప్రధాయిని భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈఓ అనిల్ కుమార్ సింగల్, జేఈఓ వీరబ్రహ్మం, సివిఎస్వో కే.వి.మురళీకృష్ణ, తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు ఆలయ డెప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపర్డెంట్ రమేష్,ప్రసాద్, సీఐ సునీల్ కుమార్, ఏవీఎస్ఓ రాధాకృష్ణమూర్తి, ఎస్ఐ సాయినాథ్, ఆర్జిత ఇన్స్పెక్టర్ చలపతి, వాహనం ఇన్స్పెక్టర్ సుభాస్కర్, ప్రసాదం ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సిఎం సొంత జిల్లాల్లో...

## అసంతృప్తిలో ఎమ్మెల్యేలు



**ప్రభాతవార్త-తిరుపతి:**

పాలనపరంగా పట్టుసాధించుకుని ప్రజలకోసం నిర్విరామంగా పనిచేసుకెళుతున్న సిఎం చంద్రబాబునాయుడు సొంత జిల్లాల్లో (తిరుపతి,చిత్తూరు)ని పార్టీ ఎమ్మెల్యేలు మౌనం వహించడం వెనుక ఆంతర్యమేమిటనేది ఆరా తీస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి 17నెలలకాలంపైగానే కావస్తున్నా ఇప్పటికీ ఉభయజిల్లాల్లో దాదాపు పదిమంది ఎమ్మెల్యేలు నియోజకవర్గ ప్రజలకేగాక ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనేది చంద్రబాబు అసహనం, ఆగ్రహం చెందడం నిదర్శనం. చాలామంది ఎమ్మెల్యేలు ప్రతినెలా మొదటితేదీ జరిగే పెన్షన్ల పంపిణీ కార్యక్రమంకు కూడా హాజరుకాలేకపోతున్నారనేది అధిష్టానం వరకు చేరిన సమాచారం. ప్రజలకు దగ్గరగా ఉంటూ వారితో కలసిపనిచేసినపుడే పార్టీకి ,ప్రజాప్రతినిధులకు మంచి పేరు ఉంటుందనేది బాబు హితోక్తి.అయినా పలువురు ఎమ్మెల్యేలు ఈ మాటలను పెడచెవినపెట్టేస్తున్నారు. చిత్తూరుజిల్లాలో పుంగనూరు మినహాయించి మిగిలిన నియోజకవర్గాల్లో పలమనేరు నుండి అమరనాథరెడ్డి సీనియర్ నాయకుడు.గతంలో మంత్రిగా కూడా పనిచేసిన అనుభవం ఉంది.చిత్తూరునుండి గురజాల జగన్‌మోహన్, పూతలపట్టులో డాక్టర్ మురళీమోహన్, జిడినెల్లూరులో డాక్టర్ థామస్,చంద్రగిరి నుండి పులివర్తినాని, శ్రీకాళహస్తినుండి బొజ్జల సుధీర్‌రెడ్డి, నగరి నుండి గాలి భానుప్రకాశ్ తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలిచిన వారే. వీరిలో కొందరు ప్రభుత్వ కార్యక్రమాలను మొక్కుబడిగా తీసుకుంటున్నారనేది పార్టీ కార్యాలయానికి చేరిన సమాచారం. ఇక సత్యవేడులో ఎమ్మెల్యే ఆదిమూలం సీనియర్ అయినా టిడిపి నుండి గెలవడం తొలిసారి. ఆయన పార్టీ నేతలతో కలసి పనిచేయలేకపోతున్నారనేది ఆ నియోజకవర్గంలో కార్యకర్తల్లో అసహనం. ఇప్పటికే ఈ ఎమ్మెల్యేల పనితీరుపై స్వయంగా చంద్రబాబు ఐవిఆర్ఎస్ విధానంలో అభిప్రాయాలు సేకరించారు. ప్రజలకు అందుబాటులో లేకపోతున్నారని, ప్రజాదర్బార్‌కూడా ప్రతినెలా నిర్వహించి ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదనేది ప్రధాన విమర్శలు. ఇక మిగిలిన వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట ఎమ్మెల్యేలు కూడా కొంత చురుగ్గా కార్యక్రమాల్లో పాల్గొంటున్నా అవసరమైన మేరకు ప్రజాసమస్యలపై ఫోకస్‌పెట్టడంలేదనేది అధిష్టానం భావిస్తోంది. మరీ ఇదే ధోరణి ఉంటే ముందుముందు పార్టీ అధిష్టానం ఎలాంటి చర్యలకు ఉపక్రమిస్తుందోననేది చూడాల్సిందే. ఇదేగాక కొందరు మంత్రి పదవులు రాలేదనే అసహనంతో తూతూమంత్రంగా ఉంటున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.ప్రజలతో నేరుగా కలిసే కార్యక్రమాల్లో చురుగ్గా ఉండాలని చివరిసారిగా బాబు హెచ్చరికలు ఎంతవరకు సానుకూలంగా మలచుకుంటారో కార్యకర్తలు చెప్పాల్సిందే.కాగా ఇటీవల సిఎం చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేలకు నెలవారీ కార్యక్రమాల డైరీని ఇచ్చారు. ప్రతి ఒక్కరూ దాన్ని అమలుచేసి ప్రజలకు చేరువగా ఉండాలని చెప్పడం ఎంతవరకు ఫలిస్తుందో చూడాల్సిందే.

## మహిళా సంఘాల జీవనోపాదులు పెంచడానికి ప్రణాళికలు

**- జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి**




వెలుగు డిపిఎం, ఎపిఎంలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి

చిత్తూరు, నవంబర్ 21 ప్రభాతవార్త: జిల్లాలోని స్వయం సహాయక సంఘాల జీవనోపాదులు పెంచడానికి క్షేత్ర స్థాయి సిబ్బంది కృషి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. డిఆర్‌డిఎ సమావేశభవనంలో శుక్రవారం డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి డిపిఎంలు, ఎపిఎంలు, సిసిలు, ఇతర డిఆర్‌డిఎ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వాలంబన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, ఈ పథకాలు సంఘ సభ్యులకు చేరువ కావాలన్నారు. అనేక పథకాలు జిల్లాలోని వివిధ శాఖలతో ముడిపడి వుండటంతో అన్ని శాఖలను సమన్వయం చేసుకుని తమ పరిధిలోని సంక్షేమ పథకాలను సంఘ సభ్యులకు అందించేలా డిఆర్‌డిఎ అధికారులు కృషి చేయాలన్నారు. తద్వారానే మహిళా సభ్యులు జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని, దీనిని దృష్టిలో వుంచుకుని క్షేత్రస్థాయి సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే సంఘాల్లో చదువుకొనివున్న సభ్యులను గుర్తించి స్థానికంగా వున్న వనరులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యానశాఖ, పశుసంవర్ధకశాఖలు సంఘ సభ్యులు అనేక పథకాలు అందించే అవకాశం వుందని, ఈ పథకాలను సంఘ సభ్యులందరు సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. అలాగే వెదురు, మునగ సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని, సంఘ సభ్యులు రుణాల విషయంగా సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించుకునే విధంగా వారిని తీర్చిదిద్దాలన్నారు. ఎంపిఎఫ్ఎంఇ, పిఎంఇజిపి రుణాలను అర్హులైన ప్రతి సభ్యురాలికి అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిపిఎంలు రవి, వరలక్ష్మీలు, ఎపిఎంలు మధుసూధన్, సుబ్బారెడ్డి, హేమలు, పలువురు సిసిలు, మండల స్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల మ్యాపింగ్‌లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**- జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్**



అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డిఆర్‌ఓ

చిత్తూరు, నవంబర్ 21 ప్రభాతవార్త: ఓటర్ల మ్యాపింగ్‌కు సంబంధించి బిఎల్‌ఓలు నిర్లక్ష్యం వీడాలని, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ సంబంధిత ఎన్నికల అధికారులను ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ శుక్రవారం ఎన్నికల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో 40 సంవత్సరాలు వయస్సు పైబడిన ఓటర్ల మ్యాపింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 15,74,844 మంది ఓటర్లు వున్నారని అందులో 8,35,533 మంది ఓటర్లు 40 సంవత్సరాలకు పైబడిన వారిగా సంబంధిత బిఎల్‌ఓలు యాప్ ద్వారా గుర్తించడం జరిగిందన్నారు. సంబంధిత బిఎల్‌ఓలు 40 సంవత్సరాలు పైబడిన వారికి ఓటర్ల మ్యాపింగ్‌లో 65 శాతం మాత్రమే నమోదు చేసి వున్నారన్నారు. మిగిలిన 35 శాతంను త్వరితంగా పూర్తి చేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారులు, నియోజకవర్గ సహ ఎన్నికల అధికారులు, మండల ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్లను డిఆర్‌ఓ ఆదేశించారు. జిల్లాలో మొత్తం కొత్తగా చేర్చబడిన కుటుంబాల సభ్యుల ఓటర్ల సంఖ్య 66,891 మంది ఓటర్లను సంబంధిత బిఎల్‌ఓల ద్వారా మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. ఎలక్షన్ కమీషన్ నిర్దేశించిన విధంగా యాప్‌లో మ్యాపింగ్ చేయాల్సివుంటుందని స్పష్టం చేశారు. అలాగే 2025 ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించిన హోం శాఖమంత్రి



తిరుచానూరు, నవంబర్ 21 ప్రభాతవార్త : పద్మావతి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. తిరుచానూరు బ్రహ్మోత్సవాల్లో భాగంగా భారత రాష్ట్రపతి పర్యటనలో ప్రోటోకాల్ నిమిత్తం విచ్చేసిన హోంశాఖ మంత్రి రాష్ట్రపతి పర్యటన అనంతరం మరోమారు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరిని తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు, సివిఅండ్ఎస్ఓ మురళీకృష్ణ, ఏఎస్పి రవిమనోహర్ ఆచారి, డీఎస్పీ ప్రసాద్ ఆలయ అధికారులు ఘనంగా స్వాగతించి దర్శన ఏర్పాట్లు చేశారు. మంత్రి ముందుగా ధ్వజ స్తంభాన్ని నమస్కరించి అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆశీర్వాద మండపం వద్ద ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ సునీల్ కుమార్, ఏవీఎస్ఓ రాధా కృష్ణమూర్తి, ఎస్సై సాయినాథ్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## విశ్రాంత శాస్త్రవేత్త మొగిలి మృతి



**వి.కోట, నవంబర్ 21 ప్రభాతవార్త** పట్టుపరిశోధన, విస్తరణ కేంద్రంలో పనిచేసిన విశ్రా ంత శాస్త్రవేత్త మొగిలి మృతి చెందారు. ఈయన కుప్పం, వి.కోట ప్రాంతంలో పట్టుసాగుపై విశేష సేవలను రైతులకు అందించారు. క్షేత్రస్థాయిలో రైతుల వద్దకు వెళ్లి వారికి పంటసాగుపై అవగాహనకల్పించడంతో పాటు పుస్తకాలు రచించి అందజేశారు. 2019లో జపాన్ దేశంలో లూయిస్ ఫాస్టర్ అవార్డు అందుకున్నారు. తెలంగాణా రాష్ట్రం వరంగల్‌లో జన్మించిన మొగిలి 1987లో మైసూర్ సిల్క్ బోర్డులో రీసెర్ చ్ సా ్కలర్‌గా పనిచేశారు. ఈయన మృతి పట్ల రైతులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## నదుల అనుసంధానానికి సిఎం చంద్రబాబు కృషి - ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి



నదుల అనుసంధానానికి సిఎం చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఆనిగానూరు గ్రామాల్లో ఆమె మహిళలనుద్దేశించి కుప్పానికి సిఎం చంద్రబాబు కృష్ణాజలాలు తరాదన్నారు. నీళ్ల లేక ప్రజలు, అన్నదాతలు ఎంతో ... బు గుర్తించారన్నారు. నదుల అనుసంధానంతో అన్ని జిల్లాలకు నీళ్ల అందించేలా ముందుకుసాగుతున్నారన్నారు. మహిళలు కూడా ఆర్థికంగా బలోపేతం చెందేందుకు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు తలచుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదన్నారు. డ్వాక్రా సంఘాలు నేడు వేలకోట్ల రూపాయల టర్నోవర్ చేస్తూ పారిశ్రామికవేత్తలుగా మారుతున్నారన్నారు. మహిళల అభ్యున్నతికి తాను కూడా ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు. తాము కుప్పం ప్రజలను ఎన్నడూ మరువమన్నారు. అ ంతకుముందు ఆనిగానూరు శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలో పాల్గొన్నారు. అనంతరం విజలాపురంలోని కళ్యాణ మండపంలో మహిళా విభాగం నేతలతో సమావేశమయ్యారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, నాయకులు మునస్వామి, పత్ర నారాయణ, వెంకటరమణ, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, నరసింహులు, కృష్ణనాయక్, జయశంకర్, రామూర్తి, చిన్నికృష్ణ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## సీడీఎస్‌ఎల్ లో ఐడియాథాన్ కి శ్రీకారం

**తిరుపతి విద్య, నవంబర్ 21 ప్రభాతవార్త:** ఆసియాలోనే తొలి లిస్టెడ్ డిపాజిటరీ 16.7 కోట్ల డీమ్యాట్ ఖాతాలకు కస్టోడియన్‌గా వ్యవహరిస్తున్న సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (సీడీఎస్‌ఎల్), కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా, విద్యార్థుల కోసం వినూత్నంగా తొలి ఐడియాథాన్‌ని ఆవిష్కరించిందని ఆ సంస్థ సీఈవో నేహల్ వోరా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లను మరింత సమ్మిళితత్వమైనవిగా, మరింత మంది ఇన్వెస్టర్లు పాలు పంచుకునే విధంగా మార్చే దిశగా నేర్చుకునేవి అని అన్నారు. సెక్యూరిటీస్ మార్కెట్ విస్తరణకు, ఇన్వెస్టర్లకు ఎదురవుతున్న అవరోధాలను తొలగించేందుకు ఇది ఎంతో ఉపయోగకరమన్నారు.

## బహుదానదిలో ట్రాక్టర్ బోల్తా: వ్యక్తి మృతి



**తవణంపల్లె, నవంబర్ 21 ప్రభాతవార్త:** మండలంలోని పుణ్యసముద్రం గ్రామ పంచాయతీ ఎల్బీపురం గ్రామ సమీపంలోని బహుదానది వద్ద శుక్రవారం మధ్యాహ్నం ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ అక్కడిక్కడే మృతి చెందినట్లు తవణంపల్లె పోలీసులు తెలిపారు, సంఘటనకు సంభందించి స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని పుణ్యసముద్రం గ్రామపంచాయతీ ఎల్బీపురం గ్రామానికి చెందిన బి.వెంకటేష్(54) అనే వ్యక్తి వ్యర్థ పదార్థాలను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని పందులకు మేతగా అగరంపల్లె సమీపంలోని బహుదానదిలో దింపుతుండగా ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా నడపడం వల్ల ట్రాక్టర్‌తో సహా ట్రాలీ అదుపుతప్పి బోల్తా పడింది. దీనితో వెంకటేష్ తీవ్రగాయాలకు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తవణపల్లె పోలీసులు తెలిపారు.

## పర్యావరణం పరిరక్షించడంపై శిక్షణ

**విజయపురం, నవంబరు 21 ప్రభాతవార్త:** పచ్చదనం పెంపొందించి పర్యా వరణాన్ని పరిరక్షించడంలో పారిశుధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తారని ఎంపీడీవో రాజేంద్ర పేర్కొన్నారు. మండలంలోని కోసలనగరంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులకు ఒక రోజు శిక్షణ సమావేశం నిర్వహించారు. చెత్త నుంచి సంపద తయారీ, పర్యావరణాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దడం వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. పొడి చెత్త, తడి చెత్తల ద్వారా తయారు చేసే సంపదలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేంద్ర కుమార్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



## సెన్యా తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండండి : తహసిల్దార్



**రేణిగుంట, నవంబర్ 21 ప్రభాతవార్త :** సెన్యా తుఫాను ప్రభావం రేణిగుంట మండలం పై ఉంటుందని తద్వారా విపరీతమైన గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటన మేరకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర ఆదేశాల తో రేణిగుంట మండల కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రజలకు వర్షాల వల్ల ఇబ్బందులు ఏర్పడినా, అత్యవసర పరిస్థితులు సంభవించినా, ఏవైనా విపత్తులు సంభవించినప్పుడు వెంటనే కంట్రోల్ రూమ్ నంబర్ 9010046456 కు సమాచారం ఇవ్వాలన్నారు. అధికారులు తక్షణం స్పందించి బాధితులకు సహాయ సహకారాలు అందిస్తారన్నారు.

## గ్రామాలు పరిశుభ్రతగా ఉంచుకోవాలి



**వడమాలపేట, నవంబరు 21 ప్రభాతవార్త:** గ్రామాలు ఎల్లప్పుడు స్వచ్ఛందంగా, పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పాదిరేడులో సుస్థిర అభివృద్ధి, అభివృద్ధి లక్ష్యాల స్థానికరణ, పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని వీధులను శుభ్రపరచారు. మండలంలోని పంచాయతీల కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్లకు శుభ్రత పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో టీడీపీ నాయకులు దాము యాదవ్, ధనంజయలునాయుడు, భాస్కర్‌నాయుడు, చందు, ఎంపీడీవో శేషగిరిరావ్, డిప్యూటీ ఎంపీడీవో కిషోర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫసల్ బీమా పథకం రైతులకు వరం



**వడమాలపేట, నవంబరు 21 ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పంటల బీమా పథకం రైతులకు వరమని వ్యవసాయ సంయుక్త కార్యదర్శి ముక్తానంద్ అగర్వాల్ పేర్కొన్నారు. శుక్రవారం వడమాలపేట మండలంలోని టీసీ అగ్రహారం రైతుసేవా కేంద్రంను ఆమె సందర్శించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి ఫసల్ బీమా పథకం అమల్లో ఉన్న కష్ట నష్టాలను విచారించారు. పథకం అమలున్న రైతులకు సౌకర్య వంతంగా ఎలా ముందుకు తీసుకెళ్లాలని చర్చించి రైతుల నుంచి సూచనలను తీసుకున్నారు. రైతులకు పంట నష్ట పరిహారం అందేలా పంటల బీమా పథకాన్ని మార్పులు చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో గుంటూరు వ్యవసాయశాఖ కేంద్ర కార్యాలయంలోని పంటల బీమా పథకం జేడీ వేణుగోపాల్, తిరుపతి జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు, పుత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కె.లక్ష్మిదేవి, వడమాలపేట ఏవో విజయకుమార్, రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జి కె.ఎస్.మోహన్, రైతులు దామోధరం, చంద్రబాబు,నాగమణి వినోద్ పాల్గొన్నారు.

## చంద్రరాజుకు ప్రముఖులు నివాళి

**వడమాలపేట, నవంబరు 21 ప్రభాతవార్త:** వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం గ్రామానికి చెందిన పుత్తూరు శాంతి థియేటర్ యజమాని పి.సి. చంద్రశేఖర్‌రాజు కర్మక్రియలకు శుక్రవారం పలువురు ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, శ్రీ బొమ్మరాజపురం వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రశేఖర్‌రాజు సేవలను స్మరించుకున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మాజీ మంత్రి రోజా నివాళి :** వైసీపీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రాజు కర్మక్రియలకు హాజరైన మాజీ మంత్రి రోజా కుటుంబ సభ్యులను పరామర్శించారు. చంద్రశేఖర్‌రాజు సేవలు, పార్టీ కోసం చేసిన కృషి ఎప్పటికీ మరచిపోలేనిదని, ఆయన ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని భావోద్వేగంతో పేర్కొన్నారు. పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

## ప్రముఖులంతా గ్రంథాలయ పాఠకులే!



**రేణిగుంట, నవంబర్ 21 ప్రభాతవార్త :** ఎంతోమంది ప్రముఖులు గ్రంథాలయాల్లో గ్రంథాలను పట్టించి ఉన్నత పదవులు అధిరోహించారని రేణిగుంట మండల ఎంఈఓ రంగనాథ్ వ్యాఖ్యానించారు. రేణిగుంట మండల గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. గ్రంథాలయ అధికారి గత వారం రోజులుగా వారోత్సవాల్లో భాగంగా వీక్షకులకు అనేక రచనలను, కవితలను, గ్రంథాలను, మహాత్ముల స్వీయ చరితలను ప్రదర్శించి వివరించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా లైబ్రేరియన్ విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ రంగనాథ్ ద్వారా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ ఎన్నో విలువైన పుస్తకాలు గ్రంథాలయాల్లో ఉంటాయన్నారు. బిజెపి యువ నాయకులు విద్యార్థి సంఘం నేత వెంకటాద్రి యాదవ్, బాలికల ఉన్నత ప్లస్ టుపాఠశాల ప్రధానాచార్యులు మోహనకుమారి, బాలురు ఉన్నత పాఠశాల ప్లస్ టుప్రధానాచార్యులుమసూదన రావు, పుర ప్రముఖులు, పాఠకులు, విద్యార్థులు ముగింపు పాల్గొన్నారు.

## రైతుల భూమి వివరాలు ఆధార్‌తో...

అన్నదాత సుఖీభవ ద్వారా లబ్ది - జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్

**చిత్తూరు, నవంబర్ 21 ప్రభాతవార్త:** ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులు లబ్ది పొందాలంటే అందుకు సంబంధించి రైతుల భూమి వివరాలు ఆధార్‌నెంబర్‌కు అనుసంధానం చేయబడి వుండాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ తెలిపారు. అలాగే వెబ్‌ల్యాండ్‌లో నమోదై వున్న రైతులకు సంబంధించి అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. అలాగే ఆధార్ పేరు రైతు పట్టాదారు పేరు ఒక్కటిగా వుండాలన్నారు. ఒక్క ఖాతాకు ఒక్కఆధార్‌నెంబర్‌వుండే విధంగా వెబ్‌ల్యాండ్ నందు సరిచేయాలని డిఆర్‌ఓ తహసిల్దార్లను ఆదేశించారు.

## సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్



**పెనుమూరు, నవంబర్ 21 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని, అధికారులు వారి దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి చర్యలు తీసకోవాలని ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ అన్నారు. పెనుమూరు ఎంపిడిఓ కార్యాలయంలో ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్ శుక్రవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల ప్రజలను చిన్న సమస్యలను సైతం పరిష్కారం కావడం లేదని తన దృష్టికి తీసుకువస్తున్నారని చిన్న సమస్యలను సైతం పరిష్కరించకుండా మండలంలో అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అనంతరం సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వారికి రూ.7.5 లక్షల చెక్కులను ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి, తహసిల్దారు శ్రావణ్‌కుమార్, ట్రాన్స్‌కో ఎఇ తులసీప్రసాద్, మండల దేశం అధ్యక్షులు రుద్రయ్యనాయుడు, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తినాయుడు, దేశం నాయకులు మనోహర్‌రెడ్డి, అశోక్ పోతనేని, రామచంద్రనాయుడు, వంగులూరు కిషోర్‌నాయుడు, పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోటర్ సైకిల్ దొంగలకు 6 నెలలు జైలు

**చిత్తూరు, నవంబర్ 21 ప్రభాతవార్త:** చిత్తూరులో పలు ప్రాంతాల్లో మోటరుసైకిళ్ళను దొంగతనం చేసిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులు జయకుమార్, లోకనాధన్‌లకు శుక్రవారం చిత్తూరు 4వ అదనపు జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి షేక్ బాబాజాన్ 6 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. చిత్తూరు నగర పరిధిలో వరుస మోటర్ సైకిళ్ల దొంగతనాలు జరుగడంతో జయకుమార్, లోకనాధన్‌లపై ఆరు కేసులు నమోదు అయ్యాయి. ఈ మేరకు చిత్తూరు టుటౌన్ పోలీసులు ఈ కేసు దర్యాప్తు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఇతర కేసుల్లో పిటి వారెంట్‌పై చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు తీసుకుని శుక్రవారం కోర్టుకు హాజరుపరిచారు. ఈ కేసులో టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, ఎస్ఐ రమేష్‌లు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తే నిందితులు పలు కేసుల్లో ప్రమేయం వుందని తేలింది. ఈ మేరకు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ కేసును పర్యవేక్షిస్తూ క్రైమ్ టీమ్‌కు మార్గనిర్దేశం చేశారు. ఈ మేరకు నిందితులు జయకుమార్, లోకనాధన్‌లకు శుక్రవారం 4వ అదనపు జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు 6 నెలల జైలు శిక్షను విధిస్తూ తీర్పు వెలువరించింది.

## మండలంలో శుభ్రత పరిశుభ్రత కార్యక్రమం



**సదుం, నవంబర్ 21 ప్రభాతవార్త:** మండలం పరిధిలో శుక్రవారం ఎంపీడీవో రాధా రాణి ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ థీమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విలేజ్ థీమ్ 5 లో భాగంగా హాండ్స్ ఆన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ బూరగమంద గ్రామ పంచాయతీలో నిర్వహించామని చెప్పారు. ఈ శిక్షణలో డిప్యూటీ ఎంపీడీవో తో పాటు అందరు పంచాయతి సెక్రటరీలు, అందరు క్లాప్ మిత్ర లు పాల్గొన్నారు.

## కెసి ఆస్పత్రిచే ఉచిత రక్తపరీక్ష శిబిరం




**శాంతిపురం, నవంబర్ 21 ప్రభాతవార్త :** కుప్పం లోని కెసి హాస్పిటల్ ఎండి డాక్టర్ మంజునాథ్ అధ్వర్యంలో శుక్రవారం కర్లగట్ట జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు ఉచిత రక్త పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వారికి బ్లడ్ గ్రూప్ నిర్ధారణ చేసి నిర్ధారణ పత్రాలు అందించారు. ఈసందర్భంగా రక్తదానం యొక్క విలువ, పిల్లలు ఆరోగ్యంగా ఉండాల ంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మంజునాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎం సతీమణిచే ప్రజలనుంచి వినతుల స్వీకరణ



**శాంతిపురం, నవంబర్ 21 ప్రభాతవార్త :** కుప్పం పర్యటనలో భాగంగా సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. కడపల్లి వద్దగల తమ స్వగృహం వద్ద శుక్రవారం ఉదయం ప్రజలనునేరుగా కలుసుకుని వారి సాధక బాధలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతులు అందుకున్నాక వాటి పరిష్కారంకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, కడ పిడివికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్‌బిఆర్‌సురేష్‌బాబు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థికసాయం



**కుప్పం, నవంబర్ 21 ప్రభాతవార్త:** స్థానిక 19వ వార్డు అంగన్‌వాడీ హెల్పర్ మృతి చెందారు. దీంతో విషయాన్ని ఐసిడిఎస్ సిడిపిఒ చంద్రకళకు కౌన్సిలర్ జిమ్‌దాము తెలియజేశారు. ప్రభుత్వం తరపున హెల్పర్ దహన క్రియలకు తక్షణ సాయంగా పదిహేను వేల రూపాయలు హెల్పర్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్‌సురేష్, చంద్రశేఖర్,రాధ,రేఖ విజయ్, అంగన్‌వాడీ యూనియన్ నేతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెదేపా నేత ముఖేష్‌చే అన్నదానం



**కుప్పం, నవంబర్ 21 ప్రభాతవార్త :** స్థానిక కొత్తపేట తెదేపా ఇన్‌చార్జ్ ముఖేష్ (అప్పు) శుక్రవారం కుప్పం లోని అనన క్యాంటీన్‌లో పేదలకు మూడు పూటల ఉచితంగా అన్నదానం చేశారు. తన జన్మదినం సందర్భంగా పేదలకు తనవంతు సాయం చేయాలని ఈకార్యక్రమం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో నేతలు సుకుమార్, సుజి, హరినాథ్‌గౌడ్, లోకి, ఉదయ్, మురళి, మణి పాల్గొన్నారు.

## వైకాపా రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా శ్రీనివాసమూర్తి



**కుప్పం, నవంబర్ 21 ప్రభాతవార్త :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా కుప్పంకు చెందిన విశ్రాంత ఎంపిడిఒ, ఎపి బ్రాహ్మణ సంక్షేమ సంఘ సమాఖ్య ఉపాధ్యక్షుడు మైసూరు శ్రీనివాసమూర్తి నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటనలో పేర్కొంది.

## పరిశ్రమ ఏర్పాటుకు స్థల పరిశీలన



**రామకుప్పం, నవంబర్ 21 ప్రభాతవార్త:** మండలంలోని బందార్లపల్లి పంచాయతీలో అత పరిశ్రమ ఏర్పాటుకు స్థానిక నేతలు, పరిశ్రమ ప్రతినిధులు స్థల పరిశీలన చేశారు. బగళనత్తం సమీపంలోని అడ్డగుట్ట ప్రాంతంలో స్థలాలు గుర్తించారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు కుప్పంకు మరిన్ని పరిశ్రమలు తెచ్చేందుకు కృషి చేస్తున్నారని తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. తహశీల్దార్ కౌలేష్, ఎంపిడిఒ లక్ష్మీ కాంత్, టిడిపి మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు మునిరెడ్డి, పెరుమాళ్, శ్రీనాథ్‌రెడ్డి, బాలరాజు,సుబ్రి, అత సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కృష్ణాజలాలకు నారా భువనమ్మ జలహారతి



**రామకుప్పం, నవంబర్ 21 ప్రభాతవార్త:** మండలంలోని విజలాపురం పెద్ద చెరువులో శుక్రవారం సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి జలహారతి ఇచ్చారు. కాగా నారా భువనమ్మకు చెరువు వద్ద మహిళలు, నేతలు ఘనంగా భారీ గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్‌సురేష్‌బాబు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## అర్ధగిరిని దర్శించుకున్న ఏర్పేడు పీఠాధిపతి

**తవణంపల్లి, నవంబర్ 21 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి వారిని ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందస్వామి శుక్రవారం దర్శించుకున్నారు. మండలంలోని శివగిరి ఆశ్రమ పీఠాధిపతి అప్రమేయానందస్వామితో కలిసి ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మాజీ ఛైర్మన్ సురేంద్రారెడ్డి దంపతులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలునిర్వహించారు. వారికి మండపంలో స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలను, సంజీవరాయని పుష్కరిణి తీర్థంనుఅందజేశారు. ఈకార్యక్రమంలోఆలయప్రధానఅర్చకులు వేణుగోపాలచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే గురజాల



**చిత్తూరురూరల్, నవంబరు 21 ప్రభాతవార్త:** చిత్తూరు నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని,ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూ వీధి దీపాలు, సిమెంట్‌రోడ్డు, కాలువలను దశల వారిగా నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. శుక్రవారం 7వ వార్డు బాపూజీనగర్, 46వ వార్డు విజయలక్ష్మీ కాలనీలో రూ.28.90 లక్షలతో నిర్మించిన సిమెంట్‌రోడ్డు, కాలువలను ఎమ్మెల్యే జగన్‌మోహన్ మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, కమీషనరు నరసింహ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులులతో కలసి ప్రారంభించారు. చిత్తూరును స్మార్ట్‌నగరంలా అభివృద్ధి చేయడంలో భాగంగా మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. సంతపేట నుంచి పత్రాంపల్లి, పాంచాలిపురం తదితర ప్రాంతాలకు వెళ్లే వారికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళల వినతి మేరకు సిమెంట్‌రోడ్డు, కాలువలను నెలరోజుల్లోనే పూర్తి చేసి ప్రారంభోత్సవం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మెన్ త్యాగరాజన్, టౌన్‌బ్యాంక్ చైర్మెన్ రమేష్‌నాయుడు, వెంకటేష్‌యాదవ్, తెదేపా నగర అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి పచ్చప్ప, నగర, నియోజకవర్గం కమిటీ నాయకులు, క్లస్టర్, వార్డు, ఇన్‌ఛార్జీలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించండి : ఎమ్మెల్యే



**చిత్తూరురూరల్, నవంబరు 21 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో విచారించి సకాలంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం ప్రజా దర్బార్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్యలను తెలుపడానికి వచ్చిన అర్జీదారులతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి వారి ఇబ్బందులను, సమస్యలను అడిగి తెలుసుకొని వినతులను స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, కమీషనరు నరసింహ ప్రసాద్, రాష్ట్ర మొదలియార్‌కార్పొరేషన్ చైర్మెన్‌త్యాగరాజన్, ఎంహెచ్‌వో డా.లోకేష్, తహసీల్దారు జయప్రకాష్, ఎంపిడివో శ్రీనివాసులు, హౌసింగ్ డిఈ శ్రీధర్, తెదేపా నగర, మహిళా నియోజకవర్గం కమిటీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## డిగ్రీ స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

చిత్తూరురూరల్, నవంబరు 21 ప్రభాతవవార్త: చిత్తూరుపట్టణం, పివికెయన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (స్వయంప్రతిపత్తి) మిగిలిన డిగ్రీ సీట్ల భర్తీకి ఈనెల 24వ తేది వరకు గడువును పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.జీవన్‌జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో సంప్రదించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు బిఏ( 9963063258), బికాం (9849959423), బియస్సీ( 9985165051)లను సంప్రదించాలని కోరారు.

## పది విద్యార్థులకు ఫీజు చెల్లించిన దాతలు



**పుంగనూరు, నవంబర్ 21 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రభుత్వ బడులకు వెళ్లి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఫీజులు చెల్లించి స్ఫూర్తిగా నిలిచారు పలువురు. మండలంలోని పూజ గాని పల్లి ఈడికి పల్లె చంద్రమాకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 101 మంది విద్యార్థులకు హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పూర్తిగా ఫీజులు చెల్లించారు. 101 మంది విద్యార్థులకు 12,625 చెక్కును దాతలు సంబంధిత పాఠశాలల హెచ్ఎం లకు అందించారు. రాష్ట్ర అధ్యక్షుడు మూడే రవీంద్ర నాయక్ మాట్లాడుతూ పలమనేరు ఇరిగేషన్ డిఈ సోక్లనాయక్, సాఫ్ట్వేర్ ఇంజనీర్ భాను ప్రసాద్, రీసర్చ్ ఎస్ కాలర్ ముఖ్య జగదీష్‌లు ఈ మొత్తాన్ని విరాళంగా అందించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టియు కార్యదర్శి మోహన్, ఎస్ టి యు నాయకులు, ప్రధానోపాధ్యాయులు రెడ్డమ్మ వెంకటరమణ హేమలత తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సురేష్



**కల్లూరు, నవంబర్ 21 ప్రభాతవార్త:** పులిచెర్ల మండలం మతుకువారిపల్లి. పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సురేష్, కార్యదర్శిగా చైతన్య, ప్రధాన కార్యదర్శిగా జయచంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు టిడిపి మండల పరిశీలకులు విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు లెక్కల ధనంజయ నాయుడు, టిడిపి నాయకులు కుమార్ రెడ్డి, బండ్ల రమేష్‌ముల్లంగి వెంకటరమణ, మురళి నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, సరస్వతి మదన, తదితరులు పాల్గొన్నారు.

## స్వామిత్వతో గృహాలకు పూర్తి చట్టపరమైన భద్రత

**కల్లూరు, నవంబర్ 21 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వామిత్వతో గృహాలకు పూర్తిస్థాయిలో చట్టపరమైన భద్రత కలుగుతుందని ఎంపీడీవో రాజశేఖర్ బాబు అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కమ్మపల్లిలో స్వామిత్వపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాణి, మాజీ సర్పంచులు ఆనంద నాయుడు గోవిందయ్య, కార్యదర్శి బాలకృష్ణ, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి, టిడిపి నాయకులు ఎల్లారెడ్డి, సుధాకర్, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని స్వామిత్వపై అవగాహన కల్పిస్తున్నారు.

## పార్టీలకు కార్యకర్తలే జీవకర్ర : నాగేశ్వర్‌నాయుడు



**చౌడేపల్లి, నవంబర్ 21 ప్రభాతవార్త:** ఏ రాజకీయ పార్టీకైనా కార్యకర్తలు జీవకర్ర లాంటి వారని రాష్ట్ర పాల ఏకిరల కార్పొరేషన్ ఛేర్మన్, మండల తేదేపా సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు నాగేశ్వర్‌నాయుడు అన్నారు. మండలంలోని ఎ.కొత్తకోట, దుర్గసముద్రం, చారాల, శెట్టిపేట, పందిళ్ళపల్లి, పెద్దయల్లకుంట్ల, వెంగళపల్లి, పంచాయతీలకు దేశంపార్టీ నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. రాష్ట్రంలోనే పుంగనూరు నియోజకవర్గం విలక్షణమైందనీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లు నేరుగా చూస్తున్నారన్నారు. కెఎస్ఎస్ సభ్యులే రాబోయే కాలంలో పార్టీలో కీలక పాత్ర పోషిస్తారన్నారు. ఎ.కొత్తకోటకు మునిరాజ, దుర్గసముద్రంకు హమీద్‌ఖాన్, చారాలకు విజయభాస్కర్‌రెడ్డి, శెట్టిపేట నారాయణరాజు, పందిళ్ళపల్లికి కిషోర్‌కుమార్, వెంగళపల్లి ఆనంద్‌లను పంచాయతీ కమిటీ ఛేర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి), సింగిల్‌విండో అధ్యక్షుడు హరిరాయల్, సీనియర్ నాయకులు మాదిరాజు లక్ష్మణరాజుపతిరాజు, మాదిరాజు ప్రదీప్‌రాజు, పురుషోత్తమరాజు, పూల చంద్రమౌళి, ఆవుల రామచంద్రయ్య, మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, ఆయా పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెత్త ప్లాస్టిక్ రహిత పల్లెసీమలను నిర్మిద్ధాం : డిఎల్‌డిఓ



**చౌడేపల్లి, నవంబర్ 21 ప్రభాతవార్త:** చెత్త, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్ధామని డిఎల్‌డిఓ రామచంద్ర పిలుపునిచ్చారు. మండలంలోని దిగువపల్లిలో మండలస్థాయి కార్యదర్శులు, గ్రీన్‌అంబాసిడర్లకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఎంపిడిఓ లీలామాధవి, ఇఓఆర్డీ కృష్ణవేణి, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాజిదర్లు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా టిడిపి కమిటీ సభ్యుల ఎన్నికలు



**సదుం, నవంబర్ 21 ప్రభాతవా ర్త** సదుం మండ లంలో టిడిపి కమిటీ సభ్యుల ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించినట్లు పరిశీలికులు పల్లం శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం గొంగివారి పల్లిలో జరిగిన కమిటీ ఎన్నికలలో కుమార్‌ను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. అదేవిధంగా తిమ్మానాయన పల్లె పంచాయతీలో కమిటీ సభ్యులుగా మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నడిగడ్డ, మార్తువారిపల్లి కమిటీలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి ప్రసాద్ రెడ్డి, బీసీ రాష్ట్ర కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ అమర్నాథ్, రమేష్ రెడ్డి ,మారుతి రెడ్డి, సుబ్రమణ్యం, రామచంద్ర, శంకర, పరంధామ, భార్గవ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్‌గా జయసింహానియామకం



**సదుం, నవంబర్ 21 ప్రభాతవార్త:**

స్థానిక మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ గా జయ సింహా నాయుడు శుక్రవారం బాధ్యత స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా ఆయన శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గం లేపాక్షి లోని గురుకులంలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ సదుం గురుకుల పాఠశాలకు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

## గ్రీన్ అంబాస్‌డీర్లకు శిక్షణ

తొట్టంబేడు, నవంబర్ 21 ప్రభాతవార్త:



తొట్టంబేడు మండలం మండలాభివృద్ది అధికారి పి.సురేంద్రనాథ్ సారధ్యంలో గ్రీన్ అంబాస్‌డీర్లు గ్రీన్ గార్డులకు శుక్రవారం ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని చిట్టత్తూరు గ్రామంలో 'స్వచ్ఛ గ్రామం- హరిత గ్రామం అనే నినాదంతో ఒక్క రోజు శిక్షణ ఇవ్వటం జరిగింది. ప్లాస్టిక్ నిషేధం ప్రతి ఇంటి ఆవరణలో చెట్టు నాటటం వాటిని కాపాడటం అనే అంశాల్లో గ్రీన్ అంబాసిడర్ల పాత్రను వివరించారు. ఈ కార్యక్రమాల్లో మండలాభివృద్ది అధికారి పి.సురేంద్రనాథ్ ఐటిసి ప్రిన్సిపల్ విద్యారమా, సీనియర్ ఫ్యాకల్టీ రూపారాణి, మధుసూధన్‌లు,మండల ఉప అధికారి గిరిధర్ భార్గవ సత్యం,గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్బంగా రానయలి నిర్వహించారు.

## దేశం సీనియర్ నాయకుడు వీరాస్వామి మృతి

తొట్టంబేడు,నవంబర్ 21 ప్రభాతవార్త:



మండలంలోని తొట్టంబేడు పంచాయతీ సీనియర్ తెలుగుదేశం నాయకుడు వీరాస్వామి మృతిపట్ల తెలుగుదేశం నాయకులు పలువురు సంతాపాలు తెలిపారు. వీరాస్వామి సర్పంచ్‌గా, గ్రామ డీలర్‌గా ఉంటూ తెలుగుదేశం పార్టీలో కీలకంగా వ్యవహరించే వారని అలాంటి నాయకుని మృతి పార్టీకి తీరనిలోటు అని మాజీ పార్టీ అధ్యక్షుడు గాలిమురళి నాయుడు వాపోయారు. ఆయన మృతికి తెలుగుదేశం నాయకులు డాక్టర్ ఉమేష్‌రావు, మిన్నల్‌రవి, మునిరాజానాయుడు, మనోహర్, వజ్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్యశాఖాధికారికి కాంగ్రెస్ మొర

శ్రీకాళహస్తి,నవంబర్ 21 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తిలో నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసదుపాయాలు కల్పించుటకు పాతికేళ్ళ క్రితం నిర్మించిన ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు దయనీయంగా మారాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారంజిల్లా వైద్యశాఖాధికారి బాలకృష్ణనాయక్‌కు ఫిర్యాదు చేసారు. 'అయ్యా ఇటు చూడండయ్యా' అంటూ మొరబెట్టుకున్నారు. ఏరియా ఆసుపత్రిలో నిత్యం కిడ్నిల బాధతో బాధపడే రోగుల కోసం డయాల్సిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు.ఇది ఎంతో ప్రయోజనకరమైనది అయితే అక్కడ జవాబుదారి తనం కొరవడిందని చెప్పవచ్చు. ఆసుపత్రి కి వచ్చే రోగుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లను వాడకలో తీసుకురావాలని కోరారు. ఆర్థిక భారం మోయలేని నిరుపేదలు వస్తే వారిని తిరుపతి రెఫర్ అంటూ డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించటం తగదన్నారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాలగురవంబాబు, కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌చార్జి తలపా దామోదర్‌రెడ్డి తమటం వెంకట నరసింహులు,ఐరాల లోకేష్‌రెడ్డి, శివశంకర్, జ్యోతీశ్వర్‌నాయక్, సురేంద్రరెడ్డి, కృష్ణమూర్తి, శోభారాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి విజేత

శ్రీకాళహస్తి,నవంబర్ 21 ప్రభాతవార్త:



అంతర్‌జిల్లా కరాటే పోటీల్లో శ్రీకాళహస్తి లోని ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సి. కిరణ్‌కుమార్ విజేతగా నిలిచారు. మదనపల్లిలో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఇండియా సారథ్యంలో అంతర్‌జిల్లా కరాటే పోటీలో విజయం సాధించారు. విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూధనరెడ్డి అభినందించారు. ఇక్కడ ఎంపికైన కిరణ్‌కుమార్ ఈ నెల 23,24లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని మదుసూధనరెడ్డి వివరించారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరుబాట

శ్రీకాళహస్తి,నవంబర్ 21 ప్రభాతవార్త:




విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 28 విద్యార్థి పోరుబాట కార్యక్రమాలను నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతు న్నాయని ముఖేష్ వివరించారు.శుక్రవారం ఎఐయస్ఎఫ్ శ్రీకాళహస్తి నియోజకవర్గం సమితి సారథ్యంల విద్యార్థులతో పాత నెల్లూరుబస్టాండు నుంచి డాక్టర్ అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలి,నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సాయికుమార్, సి.ప్రవీణ్‌కుమార్, కోగిలి మునిచందు సారథ్యంలో మాట్లాడుతూ ఈ నెల 28న భారీ ఎత్తున విద్యార్థి పోరుబాట నిర్వహిస్తామని వివరించారు.

## యస్వీయూ ఆచార్యులతో విసి సమావేశం



**తిరుపతి విద్య, నవంబర్ 21 ప్రభాతవార్త:** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆచార్య నర్సింగరావు మొదటిసారి విశ్వవిద్యాలయం లోని శాశ్వత ఆచార్యులతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం దాదాపు గంటన్నర సేపు వారు విశ్వవిద్యాలయ ప్రగతి గురించి చర్చించారు. విద్యార్థులు వుంటేనే విశ్వవిద్యాలయం వుంటుందని,వారికి చక్కని బోధన అందించి, పరిశోధన చేయించవలసిన బాధ్యత ప్రతి ఆచార్యునిపై వుందని అన్నారు.విద్యార్థుల పరీక్షల ఫలితాలను వీలైనంత త్వరలో ఇవ్వాలని, రాబోయే సెమిస్టర్ల నుంచి పరీక్ష ఫలితాలు వేగంగా వచ్చేలా చర్యలు తీసుకోబోతున్నట్లు వారు వెల్లడించారు.యస్వీయూలో మంచి అధ్యాపకులు ఉన్నారని, వారి బయోడేటా, పేటెంట్లు,సైటేషన్లు,ట్విట్టర్,సోషల్ మీడియాలో అనుసంధానం చేయబోతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు,డీన్ ఆచార్య చంద్రాయుడు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్ళ,డీన్లు, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

## స్టైపెండ్స్‌ను వెంటనే విడుదల చేయండి

తిరుపతి విద్య, నవంబర్ 21 ప్రభాతవార్త:



శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాల యంలో పెండింగ్‌లో ఉన్న ఇంటర్న్‌షిప్,పీజీ, పీహెచ్‌డి పశువైద్య విద్యార్థుల స్టైపెండ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ స్టూడెంట్స్ అండ్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. ఉప్పర నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్‌ను కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగింది. అదేవిధంగా,డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ ప్రొఫెసర్ వైకుంఠరావు మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం కల్లా మీ స్టైపెండ్ బకాయిలను విడుదల చేయిస్తాం అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పశువైద్య విద్యార్థులు డా.గిరిధర్, ముస్తఫా,అమీర్, పురుషోత్తం,నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేచే సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తిరుపతి విద్య,నవంబర్ 21 ప్రభాతవార్త:



అనారోగ్యంపాలై ఆర్థిక ఇబ్బందులు పడే వారిని ఇంటికి పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. పేదలను ఆదుకునేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,యువనాయకులు లోకేష్ లు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో సీఎంఆర్ ఎఫ్ చెక్కులను ఐదు మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణి చేశారు.ప్రభుత్వం చేస్తున్న సాయాన్ని లబ్ధిదారులు గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే వారిని కోరారు.

## ఉపాధ్యాయుల గ్రాటివిటి గురించి పట్టించుకోరా?

తొట్టంబేడు,నవంబర్ 21 ప్రభాతవార్త:

రాష్ట్రంలో రిటైర్ అయిన ఉద్యోగులకు గత సంవత్సరం అక్టోబర్ నుంచి చెల్లించలేదని ఆంధ్ర ప్రదేశ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తిరుపతి జిల్లాఅధ్యక్షుడు టి.గోపాల్ డిమాండ్ చేసారు. ఉపాధ్యాయులు తాము పనిని చేసిన కాలంలో భవిష్యత్తు కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్ సొమ్ముకు మోక్షం లేదన్నారు. ఉపాధ్యాయులు దాచుకున్న సొమ్ములు ఒక్కొక్కరికి సుమారు రూ.పదిలక్షల వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం పెన్షన్ నుంచి రికవరి చేసుకొన్న కమ్యూటేషన్ మాత్రం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని గోపాల్ ఆవేదన వ్యక్తం చేసారు.

## ఉయ్యాలసేవలో తరించిన పద్మావతీదేవి అమ్మవారు



**నారాయణవనం, నవంబర్ 21 ప్రభాతవార్త :** నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**పాకాల, నవంబరు 21 ప్రభాతవార్త:** సెన్యార్" తుపాను రాబోయే ఐదు రోజులు మండలంపై ప్రభావం చూపుతుందని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో సెన్యార్ తుఫాను పట్ల వీఆర్వోలు, వీఆర్ఏ గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు కాలువల్లో చెత్త పేరుకుపోకూడదు. వర్షపు నీరు నిలిచిపోకూడదు, సిబ్బంది 24 గంటలు గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు మేజర్ - మైనర్ చెరువులు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. రైతులకు ముందస్తు హెచ్చరిక నీటమునిగే అవకాశమున్న పంటలను వెంటనే గుర్తించాలి. అవసరమైన సమయంలో కంట్రోల్ రూమ్ నెంబర్ 9492712100కు తమ సమస్యను తెలియజేయాలని ఈ సందర్భంగా పాకాల తాసిల్దార్ తెలిపారు.

## సేవాభావంతో ముందుకు సాగాలి : ఎంపీడీవో




**పాకాల, నవంబర్ 21 ప్రభాతవార్త:** ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు సేవాభావంతో ముందుకు సాగాలని పాకాల ఎంపీడీవో వాసుదేవరావు సూచించారు. శుక్రవారం పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇరంగారిపల్లిలో నిర్వహించిన క్యాంపును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత,పరిసరాల శుభ్రత ముందు ఇంటినుండే ప్రారంభం కావాలన్నారు. కళాశాల ప్రధాన ఆచార్యులు రమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచన దృక్పథాన్ని మార్చడంలో ఎన్ఎస్ఎస్ కీలకపాత్ర వహిస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ పిఓ మాసులామణి మాట్లాడుతూ ఇరంగారి పల్లి, ముద్దనపల్లి గ్రామాల్లో వారం రోజులపాటు చేపట్టనున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునా రాజారెడ్డి, అధ్యాపకులు చిట్టి కళావతి, మోహన్ బెహరా, ఆదిశేఖర్ రెడ్డి, రమణమ్మ, వాలంటీర్లు పాల్గొన్నారు.

## విస్తృతంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం



**పాకాల, నవంబర్ 21 ప్రభాతవార్త:** సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా థీమ్ 5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ హ్యాండ్ ఆన్ డ్రైవ్ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం లో భాగంగా పాకాల గ్రామ పంచాయతీ ను ఎన్నుకుని మండలంలో ఉన్న అందరి గ్రీన్ అంబాసిడర్స్ అండ్ గ్రీన్ గార్డ్స్ రిఫ్రెష్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. పాకాల గ్రామ పంచాయతీ క్లీన్ అండ్ గ్రీన్‌గా చేయ బడింది. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి శశిరేఖ, పాకాల సర్పంచ్ కస్తూరి, ప్రజా ప్రతినిధులు, పంచా యతీకార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, క్షేత్ర స్థాయి అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సేన్యార్ తుఫానుపై హెచ్చరిక జారీ : తహసీల్దార్

**సత్యవేడు, నవంబరు 21 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు బంగాళాఖాతంలో ఏర్పడిన సేన్యార్ తుఫాను ప్రభావంతో కురవనున్న భారీ వర్షాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలని సత్యవేడు మండల తహసీల్దార్ రాజశేఖర్ అధికారులను అప్రమత్తంచేశారు. ఈ మేరకు ఆయన ఓ సర్క్యులర్ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను తీరందాటే వరకు ప్రతి అధికారి మండల హెడ్ క్వార్టర్‌లో ఉండాలని సూచించారు. తుఫాను సమయంలో బలమైన గాలులు వీచ్చే ప్రమాదం ఉన్నందున ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. 5

## ఈదల కాలువలో గల్లంతైన రైతు



**శ్రీకాళహస్తి రూరల్,నవంబర్ 21 ప్రభాతవార్త:** మండలంలోని నారాయణ పురానికి చెందిన ఓ రైతు ఈదల కాలువలో గల్లంతైనట్లు సమాచారం. అయితే ఈ రైతు మృత దేహం కోసం శుక్రవారం ఉదయం నుంచి పోలీసులు, అగ్ని మాపక అధికారులు గాలిస్తున్నారు. అయితే సాయంత్రం వరకు ఎలాంటి ఆచూకి తెలియలేదు. నారాయణ పురానికి చెందిన రైతు జయరామయ్య(70) గురువారం ఆవులను మెపుకురావటానికి బయలు దేరాడు. అయితే ఆవులు ఈదలకాలువ గట్టుమీద మేస్తున్నాయి.కానీ జయరామయ్య కనబడలేదు. బహుశా ఆతను ఈదల కాలువలో ఏమైనా కొట్టుకుపోయాడా? అని సందేహం కల్గించింది.ఆతని ఆచూకి కోసం డ్రోన్ కెమెరాలను పోలీసులు ఉపయోగించారు. అరవ కొత్తూరు సమీపంలో వంతెన కింద శవం లభించింది. దాంతో పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరాధన అల్లాహ్ సూచించినట్లు చేయాలి : రేహాన్



**శ్రీకాళహస్తి,నవంబర్ 21 ప్రభాతవార్త:** ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు తాను ఆచరించే ఆరాధన అల్లాహ్ సూచించినట్లు,మహామ్మద్ ప్రవక్త ఆచరించినట్లు ఆచరించాలి తప్ప తన ఇష్టారాజ్యంగా చేయరాదని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. భగవంతుడు దైవ దూతలను కేవలం ఆయన ఆరాధన కోసమే సృష్టించారని అయితే మానవుని కూడా తన ఆరాధన కోసం సృష్టించాడన్నారు. అయితే ఈ భవబంధాలు ఎందుకంటే సృష్టిలో తన ఆరాధనకు గల ప్రాధాన్యత కోసమే అన్నారు. ఆరాధన చేయటంలో సార్థకత ఏమిటి? అంటే మనకు అల్లాహ్ ఆదేశాలను ప్రవక్త ఆచరించిన విధానాలను ఆచరించటమే ఆరాధన అన్నారు. మన ఇష్ట ప్రకారం ఆరాధించటం తగదన్నారు.

## ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

**తొట్టంబేడు,నవంబర్ 21 ప్రభాతవార్త:** మహిళల ఆరోగ్యంపై అప్రమత్తత ఎంతో అవసరమని శుక్రవారం



ఆక్స్ ఫర్డ్‌డిగ్రీ కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎంజిఎం హాస్పిటల్స్ రెడ్ క్రాస్ సొసైటి సంయుక్తంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమాలకు ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ లక్ష్మీ ప్రసన్న పాల్గొని అవగాహన కల్పించారు.ఈ సందర్బంగా ఆమె విద్యార్థినులకు నెల సరి రుతు క్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మహిళలు నిత్యం వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమన్న నానుడికి అనుగుణంగా విద్యార్థి దశ నుంచి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ క్యాన్సర్ సంబంధిత వాక్సిన్‌లు తగు సమయంలో వేసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటి వైస్ చైర్మెన్ డాక్టర్ మయూర్ మాట్లాడుతూ నేడు మారుతున్న వాతావరణం కాలుష్య సమాజంలో ముందు జాగ్రత్త చర్యలు ఎంతో అవసరం అన్నారు. ఈ సందర్బంగా పాఠశాల కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూధనరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించుటకు రెడ్ క్రాస్ సొసైటి, ఎంజిఎం నిర్వాహకుల చొరవ ఎంత పొగిడినా తక్కువే అన్నారు.

## పిడుగు పాటుకు వ్యక్తికి గాయాలు

తొట్టంబేడు,నవంబర్ 21 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తికి సమీపంలోని తొట్టంబేడు మండలం చిట్టత్తూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం పిడుగుపాటు కు ఓ వ్యక్తి గురై చెన్నై ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం అందింది. రెండు రోజులుగా పరిసరాల్లో వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం హఠాత్తుగా ఉరుములు మెరుపులు చోటు చేసుకున్నాయి. దాంతో చిట్టత్తూరు గ్రామానికి చెందిన నరసింహారెడ్డి(36) పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా పిడిగుపాటుకు గురయ్యారని తెలిసింది. నరసింహారెడ్డి తన పంట పొలంలో వరి నాట్లు వేస్తుండగా ఆతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ పిడుగు పాటుకు బ్లాస్ట్ అయినట్లు సమాచారం. కాలిన ఆతన్ని స్థానిక ఓ కార్పొరేట్ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక చిక్సిత జరిపి పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో చెన్నైకు తరిలించినట్లు పోలీసులకు సమాచారం అందింది.

# తిరుపతి డివిజన్

## శతాధిక వృద్ధురాలి మృతికి నివాళి

పుత్తూరు, నవంబరు 21 ప్రభాతవార్త :



మండలంలోని శతాధిక వృద్ధురాలి మృతికి పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ గంజి మాధవయ్య నివాళి అర్పించారు. మండలంలోని ఉత్తరపుకండ్రిగ పంచాయతీలోని గొల్లకండ్రిగ గ్రామానికి చెందిన నల్లకుక్కల రాజమ్మ (102) సంవత్సరాలు జీవించి శుక్రవారం మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన గ్రామానికి వెళ్లి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## హిమజలో సెవెన్ వండర్స్ కార్యక్రమం



**పుత్తూరు, నవంబరు 21 ప్రభాతవార్త :** హిమజ విద్యా సంస్థల్లో శుక్రవారం సెవెన్ వండర్స్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల విద్యాశాఖాధికారులు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంచుతాయ న్నారు. మేథో సామర్థ్యాలు పెంచే కార్యక్రమాలు స్కూళ్ల లో తరచూ నిర్వహిస్తే విద్యార్థుల్లో ఐక్య పెరుగు తుందన్నారు.విద్యా సంస్థల ఛైర్మన్ ఎం.సురేంద్రరాజు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## గ్రంధాలయ వారోత్సవాల ముగింపు



**తిరుపతిరూరల్, నవంబర్ 21 ప్రభాతవార్త:** అన్నమయ్య సర్కిల్ పరిధిలో వున్న గ్రేడ్-1 గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి.గ్రంధాలయాధికారి జె.శివప్రసాద్ అధ్యక్షతన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రంధాలయ పరిషత్ సభ్యులు డాక్టర్ రాసాని వెంకటరమణయ్య ఉమ్మడి జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యధర్శి ఆర్.వి.యస్.యస్.శర్మ మాట్లాడుతూ పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుందని, మంచి సాహిత్యం సమాజ నిర్మాణానికి పునాది అని తెలిపారు. వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలలో గెలుపొందిన ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల విద్యార్థులకు క్రిష్ణారెడ్డి చైతన్య, భాష్యం, జిఎస్ఆర్ మాగ్నెట్‌లు బహుమతులు అందజేసారు.

## ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపిన సైకం



**తిరుపతిరూరల్, నవంబర్ 21 ప్రభాతవార్త:** చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి సివిల్ సప్లయ్ ఛైర్మెన్ సైకం జయచంద్రారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే ఇంటికి వెళ్ళిన సైకం జయచంద్రారెడ్డి, ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## అమ్మవారి భక్తులకు అన్నదానాలు



**చంద్రగిరి, నవంబర్ 21 ప్రభాతవార్త:** తమ అభిమాన నాయకుడు ఎంఎల్ఏ పులివర్తి నాని జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలక మండలి ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం అమ్మవారి భక్తులకు రుచికరమైన ఆహార పదార్థాలతో అన్నదానం చేశారు. తన పుట్టిన రోజు వేడుకలను సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవాలే మినహా ఎటువంటి ఆడంబరాలకు పోవద్దని ఎంఎల్ఏ పులివర్తి నాని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా వుండటంతో ఈ మేరకు ఆయన అన్నదానం జరిపించాలని భావించి జరిపించారు.

## నేటి నుండి హాకీ టోర్నమెంట్

### రాష్ట్ర స్థాయి పోటీలకు సర్వం సిద్ధం-ఫిజికల్ డైరెక్టర్ భార్గవి



**చంద్రగిరి, నవంబర్ 21 ప్రభాతవార్త:** నేటి నుండి మూడు రోజుల పాటు హాకీ టోర్నమెంట్ నిర్వహించ దానికి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిలా ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 22 నుండి 24 వరకు హాకీ టోర్నమెంట్‌ను నిర్వహించతలపెట్టారు. ఇందులో భాగంగా పిడిలు టోర్నమెంట్‌కు అవసరమైన రీతిలో గ్రౌండ్‌ను సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా 13 జిల్లాల నుండి కోచ్ మేనేజర్లు, పిఈటిలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఆ మేరకు వీరికి అవసరమైన భోజన, వసతి సౌకర్యాలను ఎంఎల్ఏ పులివర్తి నాని సహాయ సహకారాలతో ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

## రాయలచెరువులో వ్యక్తి ఆత్మహత్య



**రామచంద్రాపురం, నవంబర్ 21 ప్రభాతవార్త:** రాయలచెరువులో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన దుర్ఘటన శుక్రవారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి, కొర్లగుంట మారుతీ నగర్‌లో నివాసం వుంటున్న భాస్కర్ (45) కుటుంబ కలహాలతో రాయలచెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె వున్నారు. కేసు విచారణ చేపట్టారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : ఐసిడిఎస్



**రామచంద్రాపురం, నవంబర్ 21 ప్రభాతవార్త:** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సూపర్ వైజర్ రేవతి అన్నారు. శుక్రవారం పరమాల జడ్పీ హైస్కూల్లో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పిల్లల హక్కుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఫోక్సో చట్టం గురి ంచి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను విద్యార్థి దశలోనే ఉపాధ్యాయులు వెలికితీయాలన్నారు. హెచ్ఎం కె.రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యక ర్తలు ఎన్.రేణుక, ఉమాసుందరి, ఉషారాణి, నాగరాణి, పి.రేణుక, టి.శ్రావణి, పాల్గొన్నారు.

## బాలికల ఉన్నత పాఠశాలలో ఆడిటోరియం ప్రారంభం



**నారాయణవనం, నవంబర్ 21 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణ వనం బాలికల ఉన్నత పాఠశాలలో స్థానిక లక్ష్మీ ఫోర్ కంపెనీ సాయంతో సుమారు 10లక్షల రూపాయాలతో ఉచితంగా నిర్మించిన ఆడిటోరియంను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం సాయంత్రం రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కీ ఫోర్ కంపెనీ ఛైర్మన్ ఎ సాయిరాం పాఠశాల అభివృద్ధి కోసం ముందుకు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం ఛైర్మన్ సాయిరాం మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత సాయం చేయడానికి ముందు వుంటానన్నారు. జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, పుత్తూరు డిప్యూటీ డిఇఓ మనోహర్, ఎంఇఓ జనార్ధన్‌రాజు, మాజీ ఎంపిపి ఎపి భక్తవత్సలం, లక్కీ ఫోర్ మేనేజన్ విశ్వనాథం, సర్పంచ్‌లు లక్ష్మణన్, రమేష్‌బాబు, కెఎస్‌రవి, దేవరాజులు, బాలమురుగన్, గోవిందశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతికి వీడ్కోలు పలికిన ఎమ్మెల్యే

తిరుపతి విద్య, నవంబర్ 21 ప్రభాతవార్త:

రెండు రోజుల తిరుపతి జిల్లా పర్యటన ముగించుకుని తిరుగుపయనమైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కు రేణిగుంట ఎయిర్పోర్ట్ లో శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వీడ్కోలు పలికారు. అలాగే రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత, ఎంపీ గురుమూర్తి, కలెక్టర్ వెంకటేశ్వర్ ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు రాష్ట్రపతికి వీడ్కోలు పలికారు.

## జలదంకి మధుసూదన్‌రెడ్డి మృతికి నివాళి



నాయుడుపేట రూరల్, నవంబర్ 21 ప్రభాతవార్త: సీనియర్ నాయకులు, ప్రముఖ కాంట్రాక్టర్ జలదంకి మధుసూదన్‌రెడ్డి మృతి పట్ల మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నివాళి అర్పించారు. జలదంకి మధుసూదన్‌రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణం మధుసూదన్‌రెడ్డి పార్థివదేహానికి నివాళి అర్పించారు. అలాగే నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, శ్రీపోలేరమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ నానబాబు సుబ్బారావు, నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, కాపులూరు చక్రపాణి, పనలువరు నాయకులు నివాళి అర్పించారు.

## అంటువ్యాధులు ప్రభలకుండా చర్యలు



దక్కిలి,నవంబరు21 ప్రభాతవార్త: ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్న కారణంగా పల్లెల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా సచివాలయాల సిబ్బంది. గ్రీన్ అంబాసిడర్లు తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రవీంద్రబాబు తెలిపారు. మడలంలోని డి.వడ్డిపల్లి గ్రామంలో సచివాలయాల సిబ్బంది, గ్రీన్ అంబాసి దర్లుకు ఒక రోజు పాటు శిక్షణాకార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు వల్ల గ్రామాల్లో నీరు నిల్వ చేరి దోమల ఉధృతి పెరిగే అవకాశం ఉందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవోజీ. కోట నాగయ్య,అన్నీ సచివాలయాల కార్యదర్శిలు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

## తుపాను పట్ల అప్రమత్తంగా ఉండండి : తహశీల్దార్



సూళ్లూరుపేట, నవంబర్ 21 ప్రభాతవార్త: రెండు మూడురోజుల్లో సంభవించే టెన్నియార్ తుపాను పట్ల సూళ్లూరుపేట మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ పి.గోపీనాథ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తుపాను హెచ్చరికలు జారీ చేశారని తెలిపారు. తుపాను ప్రభావం తిరుపతి జిల్లాపై అధికంగా ఉంటుందని తెలిపారు. దీంతో సూళ్లూరుపేట మండలంపై ఈ ప్రభావం ఉంటుందని చెప్పారు. తీరప్రాంత పంచాయతీలతో పాటు కాళంగినది, పాముల కాలువ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తుపాను విషయమై తహశీల్దార్ కార్యాలయంలో 08623-244122 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్‌కు కాల్ చేసి తగిన సహాయం పొందవచ్చని గోపీనాథ్‌రెడ్డి తెలిపారు.

## గ్రామాలు పచ్చగా ఉండాలి : ఎంపిడిఓ



కోట, నవంబర్ 21 ప్రభాతవార్త: క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా కోట మండలం కొక్కుపాడు గ్రామ పంచాయతీలో క్లాప్ మిత్రలకు పారిశుధ్య కార్యక్రమాలు ఎలా చేయాలి, ఇళ్ల నుంచి తడి చెత్త, పొడిచెత్త ఏ విధంగా సేకరిం చాలనే అంశాలపై ఎంపిడిఓ దిలీప్‌కుమార్ అవగాహన కల్పించారు. మోడల్ గ్రామ పంచాయతీగా కొక్కుపాడును ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, ఎంపిడిఓ దిలీప్‌కుమార్, డిప్యూటీ ఎంపిడిఓ వేణు, పలగాటి జితేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కులపై అవగాహన అవసరం



కోట, నవంబర్ 21 ప్రభాతవార్త: మండలంలోని గూడలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు చైల్డ్ రైట్స్ అనే అంశంపై క్విజ్, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోట ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి మునికుమారి హాజరయ్యారు. చైల్డ్ రైట్స్ కార్యక్రమాలు ద్వారా 18 సంవత్సరాల లోపు పిల్లలకు ఉండే ప్రాథమిక హక్కులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కోటేశ్వరి, వై.రమణమ్మ, శ్రీలక్ష్మి, మంజుల, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్

కోట, నవంబర్ 21 ప్రభాతవార్త: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన మరో అల్పపీడనం ప్రభావం వలన రాబోయే 48 గంటల్లో తుపానుగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోట మండల తహశీల్దార్ కె.జయజయరావు కోరారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. తీరప్రాంతంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు.

## ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు



శ్రీసిటీ (తడ), నవంబర్ 21 ప్రభాతవార్త: తడ మండలం వేనాడు గ్రామంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి గ్రంథాలయ సిబ్బంది కళ్యాణి విద్యార్థులకు వ్యాసరచన క్విజ్ పోటీలో నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు.

## ఆరోగ్యకరమైన ఆహారం అందించాలి



శ్రీసిటీ,నవంబర్ 21 ప్రభాతవార్త: తమండల విద్యాశాఖ అధికారి2మల్లికార్జున రావు మండల పరిధిలోని చేనుగుంట ప్రైమరీ స్కూల్ నందు శుక్రవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యత,రుచికరమైన ఆహారం విద్యార్థులకు అందించాలని నిర్వాహకులకు తెలియజేశారు.

## తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఓజిలి, నవంబర్ 21 ప్రభాతవార్త: రానున్న 48 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఓజిలి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ పద్మావతి ప్రజలకు సూచించారు. శుక్రవారం ఈ మేరకు మండల అధికారులను అప్రమత్తం చేశారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు.

## ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

శ్రీసిటీ,నవంబర్ 21 ప్రభాతవార్త: మండల పరిధిలోని విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆధార్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి2 మల్లికార్జున రావు తెలియజేశారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆధార్ నందు ఎటువంటి తప్పులు ఉన్న సరిచేసుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

## అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ

**- వైకాపా చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి**



తిరుచానూరు, నవంబర్ 21 ప్రభాతవార్త: పద్మావతి అమ్మవారికి చంద్రగిరి నియోజకవర్గ వైకాపా ఇన్చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మహా పాదయాత్రగా వెళ్లి సారెను అందించారు. శ్రీవారి పట్టపురాణి శ్రీపద్మావతిదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో గజ వాహన సేవకు ప్రతి ఏటా పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా చెవిరెడ్డి కుటుంబం గతంలో 18 సంవత్సరాలుగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం తుమ్మలగుంట నుండి తిరుచానూరు వరకు వేదమంత్రాలు, భజన బృందాలు, మంగళ వాయిద్యాలు నడుమ పెద్ద ఎత్తున వైకాపా శ్రేణులతో కలిసి అమ్మవారికి పుట్టు వస్త్రాలు అందించారు. అమ్మవారికి అందించనున్న సారె మహా పాదయాత్రలో అడుగడుగునా ప్రతి పంచాయతీలో పెద్ద సంఖ్యలో మహిళలు వారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు వైకాపా నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

# తుమ్మలగుంట నుంచి ఆధ్యాత్మిక మహాపాదయాత్ర



తిరుపతిరూరల్, నవంబర్ 21 ప్రభాతవార్త: తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి శ్రీపద్మావతి అమ్మవారి గజవాహన సేవకు శుక్రవారం తుడ మాజీ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పట్టువస్త్రాల సారె, ఆధ్యాత్మిక మహా పాదయాత్ర శోభాయమానంగా జరిగింది. పసుపు, కుంకుమలతో అలంకరించిన సారెను భుజాన వేసుకుని మోహిత్‌రెడ్డి ముందుండగా భక్తుల గోవింద నినాదాలు, చిరు జల్లులు, మంగళ వాయిద్యాలు, వేదపారాయణాలతో యాత్ర అతిరథమైంది. తుమ్మలగుంట, గాంధీపురం, అవిలాల, లింగేశ్వర్‌నగర్, శ్రీనివాసపురం, పద్మావతీపురం, యోగిమల్లవరం మార్గంలో అడుగడుగునా గ్రామ మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. భజన బృందాలు, వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సాగిన ఈ ఆధ్యాత్మిక పాదయాత్ర విశేష ఆకర్షణగా నిలిచింది. గత 18 ఏళ్లుగా అమ్మవారి బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న చెవిరెడ్డి కుటుంబం ఈసారి కూడా సాంప్రదాయాన్ని కొనసాగించింది. తిరుచానూరు దేవాలయ అధికారులకు సారెను అందించి, ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. తోడుగా నడిచిన వందలాది భక్తులకు ప్రత్యేక దర్శనం టిక్కెట్స్ కొనుగోలు చేసి, దర్శన ఏర్పాట్లు చేసారు. గాంధీపురంలో స్పెషల్ చాక్లెట్స్ మాలతో స్వాగతం పలికిన మన్నూరు శివ పట్టువస్త్రాలతో గాంధీపురానికి చేరుకున్న మోహిత్‌రెడ్డి పాదయాత్రకు గ్రామ సర్పంచ్ మన్నూరు శివలక్ష్మీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. స్పెషల్ చాక్లెట్స్‌తో తయారు చేయించిన మాలను మోహిత్‌రెడ్డి మెడలో వేసారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైకాపా నేత మునీశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీకి...
## సంబరాలు, సన్మానాలు



శ్రీకాళహస్తి,నవంబర్ 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షులుగా రంగినేని చెంచయ్యనాయుడును నియమించటంతో శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశం వర్గాల్లో ఆనందోత్సాహాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపధ్యంలో రెండు రోజులుగా సంబరాలు జరుపుకుంటున్నారు.ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశం కార్యదర్శి కాసరం రమేష్ సారధ్యంలో భారీ ఎత్తున బాణ సంచా కాలుస్తూ పట్టణంలోని కొత్తపేట,కూదలి ప్రాంతాల్లో సంబరాలు జరుపుకున్నారు.కాగా వెలం పాలెంకు చెందిన సీనియర్ తెలుగుదేశం యువ నాయకుడు మధు సారధ్యంలో సంబరాలు ఏర్పాటు చేసారు. కేక్ కట్ చేసి యువకులకు పంచిపెట్టారు. ఇక రెండవ సారి శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మెన్ పదవిని చేపట్టనున్న రంగినేని చెంచయ్య నాయుడును వాడ వాడల్లో సన్మానాలు నిర్వహిస్తున్నారు.
శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి ఛైర్మెన్‌గా చెంచయ్యనాయుడును నియమించటంతో శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అభినందన సభను ఏర్పాటు చేసారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చెంచయ్యనాయుడు సేవలను పార్టీ కార్యదర్శి కాసరం రమేష్ వివరించారు.ఈ సమావేశంలో పార్టీ క్యాడర్ పాల్గొన్నారు.

**ఆద్యంతం ఆధ్యాత్మికతతోనే....**

## తిరుమలేశుని సేవలో రాష్ట్రపతి ముర్ము



తిరుమల,నవంబర్ 21ప్రభాతవార్తప్రతినిధి: పూర్తి భద్రత నడుమ భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము శుక్రవారం ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలోపల ఆమె కుటుంబసభ్యులతో కలసి ఆద్యాంతం ఆధ్యాత్మికత తోనే గడిపారు. పద్మావతి విశ్రాంతి గృహం నుండి ఆలయం వద్దకు చేరుకున్న రాష్ట్రపతి ముర్ము, కుటుంబసభ్యులకు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ అర్చకులు ఇస్తికఫాలత్‌తో స్వాగతం పలికారు. ఆలయంలో ఏడుకొండలస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఛైర్మన్‌నాయుడు, ఈఓ సింఘాల్ శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

## తిరుమలనుండి లక్ష్మీకాసుల హారం ఊరేగింపు



తిరుమల,నవంబర్ 21ప్రభాతవార్తప్రతినిధి: పద్మావతిఅమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో గజవాహనం, గరుడసేవరోజు అలంకరించేందుకు లక్ష్మీకాసుల హారాన్ని ఊరేగింపుగా తిరుమల నుండి పంపారు. శుక్రవారం ఉదయం ఈ లక్ష్మీకాసుల హారం శోభాయాత్ర తిరుమల ఆలయం నుండి సాగింది. స్వామివారి కాసులహారాన్ని అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తలపై పెట్టుకుని ఊరేగింపుగా తిరుచానూరుకు చేర్చారు. ఈకార్యక్రమంలో టిటిడి అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఘనంగా వీడ్కోలు



రేణిగుంట, నవంబర్ 21 ప్రభాతవార్త: భారత రాష్ట్రపతి ద్రౌపతిముర్ముకు శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు లభించింది. తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మ వారు, తిరుమల శ్రీవారి దర్శనాలు ముగించు కుని భారీ భద్రతతో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత శ్రీకాళహస్తి కలంకారి జ్ఞాపికను బహుక రించారు. విమానాశ్రయంలో రాష్ట్రపతికి రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, డీఐజీ షిమోషి వాజ్పాయ్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి ఎంపీ గురుమూర్తి, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాశ్‌రెడ్డి, రేణిగుంట తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి. డీఎస్పీ శ్రీనివాసరావు, వీడ్కోలు పలుకుతుండగా భారత వాయిసేనకు సంబంధించిన వాయుదూత్ విమానంలో బయలుదేరి వెళ్లారు. రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర, రూరల్ సీఐ మంజునాథరెడ్డి రెడ్డి విమానాశ్రయం వెలుపల, ఆమె ప్రయాణించే మార్గంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. భారత రాష్ట్రపతి పర్యటన దిగ్విజయంగా జరగడంతో జిల్లా రెవెన్యూ, పోలీసు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

## చెంచయ్యకు నియామక పత్రం అందిస్తున్న అధికారులు



శ్రీకాళహస్తి,నవంబర్ 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి ఛైర్మెన్‌గా నియమించిన రంగినేని చెంచయ్య నాయుడుకు శుక్రవారం మార్కెటింగ్ కమిటి అధికారులు కార్యాలయంలో ప్రభుత్వం జారీ చేసిన జిఓ పత్రాలను అందించారు. బహుశా కమిటి ప్రమాణ స్వీకారం ఈ నెల 30 లేదా వచ్చే నెల 3న ఉండవచ్చునని భావిస్తున్నారు. శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం తేదిలను ఖరారు చేయాల్సి ఉంది. నియామక పత్రాలను స్వీకరించే కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బత్తిరెడ్డి, కామేష్‌యాదవ్, బొల్లినేని జగన్నాధం నాయుడు, ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు, జగదీశ్వరరెడ్డి,హరినాయుడు, విజయకుమార్ నాయుడు, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం : కలెక్టర్

కాణిపాకం, నవంబర్ 21 ప్రభాతవార్త: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సామాజిక న్యాయం-సాధికారిత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులకు సహాయ పరికరాల పంపిణీ గుర్తింపు కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 20 నుండి 25 రకాల దివ్యాంగులు, వృద్ధులకు పలు రకాల సహాయ పరికరాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే 3.600 మంది లబ్దిదారులకు 4.50 కోట్ల రూపాయలతో కేంద్ర ప్రభుత్వం ద్వారా జిల్లాలో సహాయ పరికరాలను అందించడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ జిల్లాలో అంగవైకల్యం బారిన పడిన వారిలో ఆత్మవిశ్వాసం కల్పించడం కోసం సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు మానసిక ఇబ్బందులు కలుగకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘీక సంక్షేమశాఖ పిడి విక్రమ్‌కుమార్‌రెడ్డి, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, డిఆర్‌డిఏ పిడి శ్రీదేవి, కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, మండల టిడిపి అధ్యక్షులు హరిబాబునాయుడు, స్థానిక నాయకులు మధుసూధన్‌రావు, పూర్ణచంద్రరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమానికి పక్కా ఏర్పాట్లు

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి**



చిత్తూరు, నవంబర్ 21 ప్రభాతవార్త: డిసెంబర్ 21వ తేదీ జరుగనున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమానికి పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి వైద్య అధికారులను ఆదేశించారు. పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం సన్నద్ధతపై డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి శుక్రవారం వైద్య అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ 0-5 సంవత్సరాల్లోపు పిల్లల సర్వే వివరాలను ప్రతి సచివాలయంలో పక్కాగా వుంచుకోవాలని, దేశ వ్యాప్తంగా ఒకేరోజు పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించనుండటంతో జిల్లాలో ఏ ఒక్క పిల్లవాడికి తప్పిపోకుండా పోలియో చుక్కలు వేసేలా ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో డిఐఓ డాక్టర్ హనుమంతరావు, ప్రొగ్రాం ఆఫీసర్లు, డాక్టర్లు పాల్గొన్నారు.

## కాణిపాకం దేవస్థానం క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరణ



కాణిపాకం, నవంబర్ 21 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం 2026 సంవత్సరానికి సంబంధించి నూతనంగా ముద్రించిన క్యాలెండర్లు, డైరీలను పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ శుక్రవారం ఆవిష్కరించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం 2026 సంవత్సరానికి సంబంధించి దేవస్థానంకు సంబంధించి పూర్తి సమాచారంతో క్యాలెండర్లు, డైరీలను ముద్రించి విక్రయానికి అందుబాటులో వుంచింది. వీటిని ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ మేరకు నూతన క్యాలెండర్లు, డైరీలను స్వామి వారి ఎదుట వుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయంలోని బంగారు ధ్వజ స్తంభం వద్ద ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు, సూపరిటెండెంట్ కోదండపాణి, మండల టిడిపి అధ్యక్షులు హరిబాబునాయుడు, స్థానిక నాయకులు మధుసూధన్‌రావు, పూర్ణచంద్రరావు, జయచంద్రనాయుడు, ఎం.లత తదితరులు పాల్గొన్నారు.

## రాయలచెరువు గ్రామంలో ఆర్డీవో పర్యటన



కేవీబీ పురం, నవంబరు 21 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలంలోని రాయల చెరువు కట్ట తెగిపోవడం నష్టం వాటిల్లిన ఇళ్ళత్తూరు దళితవాడ, పాతపాళెం అరుంధతివాడ, ఎస్ఎల్ పురం, కళత్తూరు గ్రామాల్లో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి పర్యటించారు. శుక్రవారం గ్రామాల్లో నష్టం వాటిల్లిన వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కళత్తూరు దళితవాడను పరిశీలించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కళత్తూరు సచివాలయాన్ని పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. వరద బాధితులకు ఆరోగ్య సేవలు, పరిస్థితులు ఎప్పటికప్పుడు వారికి అందిస్తూ ఉండాలని ఆయన వారికి సూచనలు ఇచ్చారు. నష్టపోయిన ఇళ్ళకు నష్ట పరిహారం, నగదు అందించాలని తెలిపారు. వరద బాధితులు మాట్లాడుతూ మాకు ఎలాంటి ఇబ్బందులు లేని చోట రెండు పక్కా గృహాలు నిర్మించి జీవనోపాధి కల్పించాలని ఆర్డీవోని కోరారు. తాగునీటి సమస్య ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్సీ జిల్లా అధికారులతో మాట్లాడి వాటి స్థానంలో కొత్త పైపులు ఏర్పాటు చేస్తామని ఎంపీడీవోకి సూచించారు. అనంతరం కేవీబీ పురం ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసి బాధితులకు ఏమేమి నష్ట పరిహారాలను అందించాలని ఎంపీడీవోకి సూచించారు. గ్రామాల్లో విద్యుత్ దీపాలు, అత్యవసర వస్తువులను పంపిణీకి సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆర్డీవో కొన్ని రాయలచెరువు పరిశీలించారు. తహసీల్దార్ రోశయ్య, ఎంపీడీవో మాలతి, డీలరు రమేష్‌చంద్ర, సచివాలయ సిబ్బంది, వీఆర్‌వో ఉష, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై ఆర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే



నారాయణవనం, నవంబర్ 21 ప్రభాతవార్త : సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం తహశీల్దారు కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉదయం 10గంటలకు ప్రారంబమైన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి సమస్యలపై ఆర్జీలు వెల్లువెత్తాయి. మండల నలుమూలల నుంచి ప్రజలు దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను ఆర్జీల రూపంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సమక్షంలో మండల స్థాయి అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలెవ్వరు సమస్యలతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఆలోచన విధానంతో మంగళగిరి తర్వాత మొట్ట మొదటిసారిగా సత్యవేడు నియోజకవర్గం నారాయణవనంలో ఈ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రధానంగా బ్రాహ్మణాతాంగేల్‌కు స్మశానస్థల సమస్యను బిఎస్‌పి నియోజకవర్గ ఇంచార్జీ ధనంజయులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించి పరిష్కారం చూపాలన్నారు. . ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, మాజీ ఎంపిపి పి గోవిందస్వామి, ఎపి భక్తవత్సలం, మాజీ వైస్ ఎంపిపి టి సుబ్రమణ్యం, యంగ్ ప్రొఫెషనల్ సివిఎపి యూనిట్ సత్యవేడు పి రాజారాం, సర్పంచ్‌లు కెజి శారదమ్మ, డి.ఆరుముగం, రమేష్‌బాబు, ఏలుమలై, రామమూర్తి, నాగూరు, మాజీ సర్పంచ్‌లు కెఎస్‌రవి, ఎన్ ఉమా కందస్వామి నాయుడు, డిసిసిబి మాజీ డైరెక్టర్ ఊరప్ప, ఎంపిడిఓ అరుణ, డిప్యూటీ తహశీల్దారు భానుచందర్, ఇఓపిఆర్‌డి వేణయ్య, ఎంఇఓ జనార్ధన్‌రాజు, ఎపిఓ సుఖన్య, ఎపిఎం ధనంజయరెడ్డి, నాయకులు బిఎం నరేష్, ఆరుముగం, కీళగరం నాగరాజు, దేవరాజులు, ముత్తు, మోహన్, ఆలీబాయ్, బాలమురుగన్, కెజి లక్ష్మణన్, కుట్టి బాలయ్య, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెన్యార్ తుఫానుతో ..ఆందోళనలో అన్నదాతలు




శ్రీకాళహస్తి,నవంబర్ 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజకవర్గాల్లో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఓ వైపు ఈశాన్య రుతుపవనాల ద్వారా విస్తారంగా వర్షాలు కురుస్తాయి. ఈ నేపథ్యంలోనే ఈ నెలల్లోనే అల్పపీడనాలు జతకడుతున్నాయి. దాంతో మూడు నెలల్లో సుమారు 1200 మి.మీల వర్షపాతం నమోదౌతుంది. అక్టోబర్ సాధరణ సగటు వర్షపాతం 229 మి.మీలు కాగా ఈ ఏడాది అక్టోబర్‌లో 600 మి.మీలకుపైగా వర్షపాతం నమోదైంది. ఇక నవంబర్ మాసం సాధారణ సగటు వర్షపాతం 332 మి.మీలు. రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈనెల 22 నుంచి 30 వరకు తుఫాను హెచ్చరికలు ఆందోళన కల్గిస్తున్నాయి. ముఖ్యంగా ఈ నెల 22 నుంచి సెన్యార్ తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తం కావాలని సూచించారు. ప్రస్తుతం శ్రీకాళహస్తికి సమీపంలో చిన్నకనపర్తి సమీపంలోని మంగళపురి చెరువు తూము కొట్టుకుపోయే దుస్థితి చోటు చేసుకుంది. ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. గతంలో వర్షాభావ పరిస్థితితో రైతులు తుఫాన్లు కోసం ఎదురు చూసే వారు ఈ ఏడాది ఎక్కడ తుఫాను వస్తుందో అని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చెరువులు నిండాయి కాలువలు పొంగి పొర్లుతున్నాయి. ఎటు చూసినా నీళ్ళె దర్శనమిస్తుంది. మళ్ళీ బంగాళా ఖాతంలో అల్ప పీడనాలు, వాయుగుండంగా మారే ప్రకటరలతో అన్నదాతల్లో ఆందోళనలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికే చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి దశల వారిగా తెరపలు తెరపలుగా వర్షం కురుస్తుంది. ఇప్పటికే కెవిబిపురం మండలంలోని కళత్తూరు సమీపంలోని రాయల చెరువు తెగి ప్రమాదం చోటు చేసుకుంది.ఈ సంఘటనలు మరువక ముందే మళ్ళీ తుఫాన్లు, వాయుగుండంగా మారే అవకాశం ఉందని హెచ్చరికలు,అధికారులు అప్రమత్తం కావటంతో అన్నదాతల్లో ఆందోళన చోటు చేసుకుంది.మరి ఏమౌతుందో అని రైతులు ఉత్కంఠతతో ఉన్నారు.